# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 196

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy | సంపాదకులు : కె.భాస్కర్‌రావు | రూ.2.00/- పేజీలు 8 | తేది: శనివారం 15 ఆగష్టు 2026








ఝార్ఖండ్‌లో విద్యార్థుల నిరసన కార్యక్రమానికి సంబంధించి పోలీసులు తాజాగా 600 మందిపై కేసు నమోదు చేశారు. కేసు ఎదుర్కొంటున్న వారిలో 500 మంది గుర్తు తెలియని విద్యార్థులు కూడా ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో పేపర్ లీక్స్ ఉదంతాలకు నిరసనగా విద్యార్థులు నిరసనలు చేపడుతున్న విషయం తెలిసిందే.

**సమయం ప్రతినిధి:** నిరసన కార్యక్రమాలు ప్రస్తుతం 20వ రోజుకు చేరుకున్నాయి. సోమవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో ఉద్రిక్త త పరిస్థితులు కనిపించాయి. విద్యార్థులను అదుపు చేసేందుకు పోలీ సులు బ్యాటన్ చార్జ్ చేశారు. వాటర్ క్యానన్, భాష్పవాయువు ను ప్రయోగించారు. పోలీసుల దౌర్జన్యానికి నిరసనగా మరుసటి రోజు బీజేపీ రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. పరీక్ష నిర్వహణ విషయంలో ప్రభుత్వం తమ డిమాండ్స్‌కు తలొగ్గే వరకూ నిరసనలు విరమించేది లేదని విద్యార్థులు స్పష్టం చేస్తున్నారు. జేపీఎస్‌సీ-జేఎస్ఎస్‌సీ మంచ్ ఆధ్వర్యంలో రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియం వద్ద నిరసనలు కొనసాగుతున్నాయి. పరీక్ష నిర్వహణలో మరింత పారదర్శకత తీసుకురావాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. పేపర్ లీక్ ఆరోపణలు ఉన్న పలు పరీక్షలను రద్దు చేయాలని కోరుతున్నారు. సీబీఐ లేదా ఇతర రాష్ట్రాల మాజీ జడ్జిలతో స్వతంత్ర దర్యాప్తు నిర్వహించాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే, విద్యార్థుల డిమాండ్స్‌ను ప్రభుత్వం మరో వారంలోపు నెరవేర్చకపోతే తాను నిరాహార దీక్షకు దిగుతానని మాజీ ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ బుధవారం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా 1200 యూనివర్సిటీల్లో తాము నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్టు ఏబీవీపీ కూడా తెలిపింది.




విదేశాల్లో ఉంటున్న భారతీయులపై దాడులు గత ఐదేళ్లల్లో 7 రెట్లు పెరిగాయని విదేశాంగ శాఖ రాజ్యసభలో వెల్లడించింది. 2021లో విదేశాల్లో భారతీయులపై దాడులకు సంబంధించి 15 ఘటనలు వెలుగులోకి రాగా 2025 నాటికి ఈ సంఖ్య 104కు చేరింది. భారతీయులపై హింసాత్మక దాడి ఘటనలు అత్యధికంగా యూఎస్, యూఏఈ, యూకే, కెనడాల్లో వెలుగుచూశాయి.

**సమయం ప్రతినిధి:** మొత్తం 36 దేశాల గణాంకాలను విదేశాంగ శాఖ రాజ్యసభ ముందుంచింది. అమెరికాలో గత ఐదేళ్లల్లో భారతీయులకు సంబంధించి 33 కేసులు వెలుగు చూశాయి. యూఏఈలో 32 కేసులు, యూకేలో 31, కెనడాలో 30 కేసులు వెలుగు చూశాయి. ఇక ఐర్లాండ్‌లో గత ఐదేళ్లల్లో భారతీయులపై 24 హింసాత్మక దాడులు జరగ్గా, రష్యాలో 23, జర్మనీలో 19 ఉదంతాలు బయటపడ్డాయి. 2021-25 మధ్య కాలంలో మొత్తం 302 దాడి కేసులు వెలుగు చూడగా 2025లో అత్యధికంగా 104 హింసాత్మక ఘటనలు జరిగాయి. భారతీయులపై హింసాత్మక దాడుల పెరుగుదలలో ఏటా హెచ్చుతగ్గులు ఉన్నాయని గణాంకాల్లో తేలింది. యూఎస్‌ఏలో 2021లో ఒక్క ఘటన బయటపడగా, 2022లో ఆరు, 2023లో ఒకటి, 2024లో 11, 2025లో 14 దాడి ఘటనలు జరిగాయి. ఇక యూకేలో 2021లో ఒక దాడి ఘటన వెలుగు చూసింది. 2022లో నాలుగు ఉదంతాలు, 2023లో పదకొండు, 2024లో పది, 2025లో ఐదు వెలుగు చూశాయి. ఇక కెనడాలో 2021లో భారతీయులపై దాడులకు సంబంధించి మూడు కేసులు వెలుగు చూడగా2022, 2023 సంవత్సరాల్లో ఆరు కేసుల చొప్పున నమోదయ్యాయి. 2024లో ఏడు, 2025లో 8 దాడి ఘటనలు వెలుగు చూశాయి. మాలీలో 2021-24 మధ్య కాలంలో ఒక్క కేసు కూడా లేకపోగా 2025 11 కేసులు వెలుగు చూశాయి.

## పాలమూరు విద్యాశాఖ వింత లీలలు.. ఇదో ఉదాహరణ మాత్రమే!

- ఫిర్యాదు అందిందా కాసుల బేరం ప్రారంభం
- అప్పుల పేరుతో టోకరాకు ఎత్తు గడ
- ఇది మండల మాజీ విద్యాధికారుల తీరు

**మహబూబ్‌నగర్, ఆగస్టు 14 (సమయం ప్రతినిధి):** పాలమూరు విద్యాశాఖలో ఏదైనా సరే డబ్బులు సంపాదించడానికి అందె వేసిన చేయి.మంచి చెడు అనేది వీరికి తేడా తెలియదు, ఏదైనా పర్వాలేదు తమకు డబ్బు వస్తుందా లేదా అనేది ఆలోచన చేస్తారు.ముఖ్యంగా గత సంవత్సరం గుర్తింపు లేని పాఠశాలల గురించి పలు ఫిర్యాదులు వచ్చాయి. ఆ విషయంలో గత సంవత్సరంలో అనుకున్నంత డబ్బు సంపాదించారు అనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా ప్రైవేట్ స్కూల్లల్లో నిర్వహణ గుర్తింపు అనేవి విద్యాశాఖ కు సంబంధించిన ఫైలు. మండల జిల్లా అధికారుల నుండి కమిషనర్ ఆఫీస్ చేరుతాయి. ఈ ప్రక్రియలో చట్టంలో ఉన్న లోపాలు అన్ని ఆసరాగా చేసుకొని వారు కావాల్సినంత డబ్బు సమకూర్చుకొని పాఠశాల ఏర్పాటుకు వారే ప్రోత్సాహం అందిస్తారనే ఆరోపణలు ఉన్నాయి.

**ఇది ఒక ఎత్తు :** అయితే...ఇంకొక సమస్య.. పాఠశాలల లోపాల గురించి పత్రికలలో వార్తలు రాగానే అది ఆ విద్యాశాఖ కు అందిన ఫలంగా సంతోషం వ్యక్తం అవుతాయి. గుర్తింపు లేని పాఠశాలకు అనుమతి ఇచ్చేది వారే, గుర్తింపులేనందుకు ప్రజలు అడిగితే వాళ్ల మీద చర్యలు తీసుకోవాల్సింది వారే రెండు వాళ్లకు లాభసాటి వ్యాపారంగా లాభం చేకూరుస్తున్నాయి. ఈ మధ్యకాలంలో ఒక మాజీ మండల విద్యాశాఖ అధికారి చేసిన లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలను పట్టించుకోకుండా, చిన్నచిన్న లోపాలను చూపిస్తూ సక్రమంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై ఒత్తిడి తీసుకువస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల ఒత్తిళ్లు, వ్యక్తిగతంగా డబ్బులు అడగడం, తీసుకున్న మొత్తాలను తిరిగి చెల్లించకపోవడం వంటి ఆరోపణలు కూడా తెరపైకి వస్తున్నాయి. ఇవన్నీ విద్యాశాఖలో కొనసాగుతున్న వింత లీలల్లో ఇదొక భాగమేనని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అంటున్నాయి.




**ఆస్పత్రిలో ఉన్నా...అప్పు ఇయ్యాల్సిందే..**

"ఆసుపత్రిలో ఉన్నాను, నా కూతురు ఆరోగ్య పరిస్థితి బాగాలేదు, అని ఎంత చెప్పిన వినకుండా అప్పుగా డబ్బులు ఇప్పించాలని తనను బ్రతిమలాడిన పద్ధతిలో ఒక విద్యాధికారి వేదించింది. తనను ఫోన్లో రూ.2 లక్షలు అప్పుగా ఇప్పిచమని విపరీతమైన ఒత్తిడి పెట్టారన్నారని ఓ పాఠశాల కరెస్పాండెంట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఎవరికో కాదు ప్రైవేటు పాఠశాల సంఘంలో బాధ్యతలో ఉన్న వ్యక్తిని ఇలా వేధించడం జరిగింది. దీనిపై ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు బొడ్డు మల్లేష్ ను అడగ్గా తనకు ఎదురైన అనుభవాన్ని వెల్లడించారు. గతంలో మండల విద్యాశాఖ అధికారిగా పనిచేసిన జయశ్రీ ఒకసారి తనకు ఫోన్ చేసి, 2024 వేసవి సెలవుల్లో పదో తరగతి విద్యార్థులకు ఏప్రిల్ చివరి వరకు తరగతులు నిర్వహిస్తున్నారా అని అడిగింది, ఏమి నిర్వహించడం లేదని తెలియజేయడం జరిగింది. అయితే మీరు నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల నిర్వహిస్తున్నట్లు మాకు ఫిర్యాదులు అందాయి. దీనికి మీరు 50 వేల రూపాయలు చలానా కట్టాల్సి ఉంటుంది అని నోటీసు అందజేశారు. అయితే సదరు పాఠశాల యాజమాన్యమైన బొడ్డు మల్లేష్ గారు అందుకు సంబంధించిన జీవో కాపీ చూయించండి 50 వేల రూపాయలు చెల్లిస్తానని వెల్లడించడం జరిగింది. ఎప్పుడైతే జీవో కాపీ ఆడి గారో అప్పుడు ఆ అంశాన్ని పక్కన పెట్టేసి, నాకు చాలా ఇబ్బందిగా ఉంది రెండు లక్షల రూపాయలు అప్పు ఇవ్వమని చాలాసార్లు ఫోన్ ద్వారా అభ్యర్థించడం జరిగిందని తెలియజేశారు. అయితే తాను అందుబాటులో లేకపోవడం వల్ల పాఠశాల సిబ్బందితో ఆ మొత్తాన్ని అప్పుగా ఇచ్చినట్లు, దానికి బదులుగా ఆమె తన చెక్కును పాఠశాల సిబ్బందికి అందజేసినట్లు తెలియ జేశారు. కొంతకాలం పాటు వడ్డీ చెల్లించినప్పటికీ, తీసుకున్న డబ్బులు ఏమాత్రం చెల్లించ లేదన్నారు. "ఇప్పటికే ఆమె పదవీ విరమణ చేసి పట్టణాన్ని విడిచి వెళ్లిపోయారు. నాకు ఇవ్వాల్సి న రూ.2 లక్షలకు సంబంధించిన చెక్కు బౌన్స్ అయింది. ఫోన్ చేసినా ఎత్తడం లేదు అని బొడ్డు మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విధంగా పట్టణంలోని మరికొన్ని ప్రైవేట్ పాఠశాలల నుంచి కూడా వివిధ కారణాలతో అప్పుల పేరుతో డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. "పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా ఉంటే అధికారులు చర్యలు తీసుకోవచ్చు. కానీ నిబంధనల పేరుతో ఒత్తిడి తెచ్చి వ్యక్తిగతంగా డబ్బులు అడగడం, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడం అనేది, ఏ విధమైన అధికార వ్యవహారశైలి? ప్రైవేట్ పాఠశాల నిర్వహణ నేరంగా మారిన పరిస్థితిగా కనిపిస్తోంది. విద్యాశాఖలో వెలుగులోకి వస్తున్న అనేక వింత లీలల్లో ఇది ఒకటి. ఇలా తవ్వుతూ పోతే ఎన్నో సంఘటనలు బయటకు వచ్చే విధంగా కనిపిస్తున్నాయి. చాలామంది కరెస్పాండెంట్లు వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యలను చెప్పుకునే పరిస్థితిలో కూడా లేనట్లు కనబడుతుంది. ఎందుకంటే పాఠశాల నిర్వహణ అంటే ఎంతోమంది విద్యార్థులతో, తల్లిదండ్రులతో, సమాజంతో సంబంధాలతో కూడుకున్నది,కాబట్టి ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఉంటుంది. అధికారులతో నిత్యం సంబంధాలను మెరుగ్గా ఉంచుకోవాల్సిన అవసరం కూడా ఉంటుంది. కాబట్టి వారు నోరు విప్పడం లేదు.ఇప్పుడు కూడా సదరు అధికారి పదవీ విరమణ పొందిన కారణంగా ఆయన నోరు ఎత్తినట్లు అనిపిస్తుంది.




**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** చదువుతోనే ఆత్మగౌరవం, గుర్తింపు లభిస్తాయని, విద్య ఒక్కటే తలరాతలను మార్చే మార్గమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ (శుక్రవారం) నెక్లెస్ రోడ్డులో మహాత్మా జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి ఫూలే దంపతుల విగ్రహాలను సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒకవైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మరోవైపు ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు, జ్యోతిబా ఫూలే విగ్రహాలను ఆవిష్కరించుకోవడం గర్వకారణమని రేవంత్ పేర్కొన్నారు. నెక్లెస్ రోడ్ చౌరస్తా ఇప్పుడు అద్భుతంగా మారిందని చెప్పారు. 150 ఏళ్ల క్రితమే జ్యోతిబా ఫూలే చదువే ఏకైక మార్గమని చాటిచెప్పారని, తాను చదువుకోవడంతో పాటు తన సతీమణి సావిత్రిబాయి ఫూలేను చదివించి ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇంతకాలం తర్వాత కూడా ఫూలేను ఆదర్శ పురుషుడిగా గుర్తిస్తున్నామంటే ఆయన ఆలోచనల గొప్పతనం అర్థమవుతోందని సీఎం అన్నారు. తమ ప్రభుత్వం జ్యోతిబా ఫూలే ఆలోచనలను కొనసాగిస్తోందని తెలిపారు. కుల నిర్మూలన, సామాజిక చైతన్యం సాధించాలంటే అందరూ కలిసి చదువుకోవడం, జీవించడం అవసరమన్నారు. అందుకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నామని, నర్సరీ నుంచి విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్‌తో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. వారి స్ఫూర్తితో విద్యలో రాణించాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పారదర్శకంగా అమలు చేస్తామని, ముందుగానే నిధులు అందించే విధానాన్ని తీసుకొస్తున్నామని చెప్పారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఏ కళాశాలా అడ్డుకోలేని విధంగా చర్యలు చేపడుతున్నామని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ ఒక్కటే ఉద్యోగానికి సరిపోదని ఆయన స్పష్టం చేశారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యతో పాటు నైపుణ్యాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్కిల్స్ ఉంటేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నర్సింగ్ రంగంలో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. 2024లో టాటా సంస్థతో కలిసి 119 నియోజకవర్గాల్లో ఏటీసీలను ఏర్పాటు చేశామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయా కేంద్రాల్లో చేరిన విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్టైఫండ్ ఇస్తున్నామని చెప్పారు. విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలంటే కేవలం మార్కులు, డిగ్రీలు సరిపోవని, నైపుణ్యాలూ అవసరమని అన్నారు. గ్రూప్-1 నియామకాల్లో బీసీలకు పెద్ద సంఖ్యలో అవకాశాలు లభించాయని తెలిపారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు. క్రీడల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తున్నామని చెప్పారు. సిరాజ్, నిఖ్కజ్, దీప్తి వంటి క్రీడాకారులకు ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు గురించి ఎంత బాధ్యతగా ఆలోచిస్తారో, తానూ అంతే బాధ్యతగా ఆలోచిస్తానని రేవంత్‌రెడ్డి అన్నారు. క్రీడల్లో రాణించి పతకాలు తీసుకొస్తే నగదు నజరానాలతో పాటు ఉద్యోగాలు ఇచ్చే బాధ్యత తనదేనని చెప్పారు. 2వ పేజీలో...




**ఢిల్లీ, సమయం ప్రతినిధి:** తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఫొటో కచ్చితంగా పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటా కింద ఇచ్చే బియ్యానికి రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం లేదని రఘునందన్ రావు ఆక్షేపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే ఆరు కిలోల బియ్యంలో ఐదు కిలోలు కేంద్రం ఇస్తున్నవేనని ఎంపీ పేర్కొన్నారు. ఒక్క కిలో బియ్యం ఇస్తూ కార్డుపై ముగ్గురు కాంగ్రెస్ నేతల ఫొటోలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలతో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వడాన్ని రఘునందన్ రావు ఆక్షేపించారు. మోదీ ఫొటో లేకపోవడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 1.06 కోట్ల రేషన్ కార్డుల పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, కొత్తగా ఎన్ని ఇస్తున్నారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. రేషన్ కార్డుల ముద్రణ ఖర్చులు, టెండర్ల వివరాలు బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంపీ డిమాండ్ చేశారు. కార్డుల ముద్రణ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు, ఎన్ని కోట్లు ఖర్చు చేస్తున్నారనే వివరాలను వెల్లడించాలన్నారు.




**ఢిల్లీ, సమయం ప్రతినిధి:** దేశ రాజధాని రేపటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సిద్ధమవుతోన్న వేళ, ఢిల్లీలో తీవ్ర కలకలం రేగింది. ఢిల్లీ హైకోర్టుకు వచ్చిన ఒక బెదిరింపు ఈ-మెయిల్ భద్రతా దళాలను, పోలీసులను ఉలిక్కిపడేలా చేసింది. ఎర్రకోట వద్ద ప్రధాని నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగించే సమయంలోనే దాడులకు పాల్పడతామని ఆగంతకులు ఆ మెయిల్‌లో హెచ్చరించడం సంచలనంగా మారింది. ఆగస్టు 15న ఎర్రకోట లక్ష్యంగా బాంబు పేలుళ్లకు పాల్పడతామని మెయిల్‌లో పేర్కొన్నారు. ఉగ్రవాదులు లేదా అసాంఘిక శక్తులు పోలీసు యూనిఫామ్‌లో ఎర్రకోట ప్రాంగణంలోకి ప్రవేశించి ఈ దాడులకు పాల్పడే అవకాశం ఉందని వెల్లడించారు. దేశ ప్రధాని స్వాతంత్ర్య దినోత్సవ సందేశమిచ్చే అత్యంత కీలక సమయంలోనే ఈ పేలుళ్లు జరుపుతామని సవాలు విసిరారు. 1984లో జరిగిన సిక్కు వ్యతిరేక హింసాకాండకు బాధ్యులైన రాజకీయ నేతలపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఈ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని డిమాండ్ చేశారు. బెదిరింపు ఈ-మెయిల్ రాగానే ఢిల్లీ పోలీసులు, బాంబ్ స్క్వాడ్, ఇంటెలిజెన్స్ వర్గాలు తక్షణమే రంగంలోకి దిగాయి. ఆగస్టు 15 వేడుకలు జరిగే ఎర్రకోట పరిసర ప్రాంతాలలో భద్రతను అత్యున్నత స్థాయికి (High Alert) పెంచారు.

# సంపాదకీయం

## ఈసారీ కుల లెక్కలు గట్టెక్కలేవా?

జరిగిన ఘటనలను పునరావృతం చేయాలని చాలా మంది అనుకుంటారు. ఆశించినట్లుగా వాటిని పునరావృతం చేయలేరు. అయినా ప్రయత్నాలను ఆపరు. మానవ ప్రవర్తనలో దీన్ని సహజమే అనుకోవచ్చు. వైఫల్యాలను పునరావృతం చేయాలని మనం ఎవ్వరమూ అనుకోం. కానీ కులాల లెక్కింపు విషయంలో మాత్రం ఇప్పుడు ఆ ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటివరకూ అనధికారికంగా వెల్లడైన సమాచారాన్ని పరిశీలిస్తే దీన్నంత తేలికగా కొట్టేయలేం. దేశంలో మంచు అధికంగా ఉండే ప్రాంతాల్లో రెండో దశ జనాభా లెక్కల ప్రక్రియ త్వరలో ప్రారంభం అవుతోంది. అక్కడ జనాభా సంఖ్యతో పాటు ఏ కులానికి చెందిన ప్రజలు ఎందరున్నారన్న సమాచారాన్ని కూడా సేకరించాలి. సెప్టెంబరు ఒకటి నుంచి లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో కొన్ని ప్రాంతాల్లో ఇది జరగాలి. దాదాపు 15 రోజుల సమయమే ఇంకా మిగిలి ఉంది. ఇంతవరకూ కులాల సమాచారాన్ని ఏ విధంగా సేకరిస్తారన్న విషయాన్ని స్పష్టంచేస్తూ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. గతంలో ఎప్పుడూ ఇంత జాప్యం జరగలేదు. బహుశా ప్రక్రియ ప్రారంభానికి ముందు చాలా తక్కువ వ్యవధిలో దాన్ని జారీచేస్తే వివాదాలను బాగా పరిమితం చేయగలమన్న ఉద్దేశమే దానికి కారణం కావొచ్చు. నోటిఫికేషన్ ఆలస్యం చేస్తున్నా జనాభాగణనలో పాల్గొనే సిబ్బందికి వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వటం దాదాపుగా పూర్తయింది. శిక్షణ సందర్భంగా ఒక విషయాన్ని స్పష్టంచేశారు. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల (ఎస్సీ, ఎస్టీ) విషయంలో గతంలో చేసినట్టే ఆయా కులాల, తెగల సమాచారాన్ని సేకరిస్తారు. అంటే కేంద్ర ప్రభుత్వం గుర్తించిన రాష్ట్రాల వారీ ఎస్సీ, ఎస్టీ జాబితాను అనుసరించి ఎవరు ఏ కులానికి చెందితే అక్కడ వారి సమాచారాన్ని నమోదుచేస్తారు. తాము ఎస్సీ వర్గానికి చెందినవారమని ఒక కుటుంబం చెబితే ఆ వర్గంలో ఏ కులమో తెలుసుకుని ఫాంలో సంబంధిత బ్రాకెట్‌లో టిక్కు పెట్టుకుంటారు. ఎస్టీల విషయంలోనూ అదే చేస్తారు. మరి వెనుకబడిన కులాల (బీసీలు) విషయంలో దీన్నే చేస్తారా అంటే? ఇప్పటివరకూ వస్తున్న సమాచారం ప్రకారం అలా చేసే అవకాశం కనపడటం లేదు. కేంద్ర జాబితాలో బీసీ కులాల సంఖ్యకు, రాష్ట్రాల జాబితాలోని బీసీ కులాల సంఖ్యకు చాలా తేడా ఉంది. ఉదాహరణకు తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం 133 కులాలను బీసీలుగా గుర్తిస్తే కేంద్ర జాబితాలో 90 కులాలు మాత్రమే ఉన్నాయి. మహారాష్ట్ర ప్రభుత్వం 346 కులాలను బీసీలుగా గుర్తిస్తే కేంద్రం మాత్రం 261నే పరిగణనలోకి తీసుకుంది. కాబట్టి తన జాబితా ప్రకారం బీసీల జనాభాను కులాల వారీగా గుర్తించటానికి కేంద్రానికి ఇబ్బందులు ఉన్నాయి. ఒకవేళ అలా చేస్తే కొన్ని వందల కులాలు ఆ జాబితాకు బయటే ఉండిపోతాయి. పోనీ రాష్ట్రాల వారీ బీసీల జాబితాను పరిగణనలోకి తీసుకుని వాటి ప్రకారం విడివిడి కులాల జనాభా లెక్కలను సేకరిస్తే వాళ్లందరినీ కేంద్ర బీసీ జాబితాలో చేర్చాలనే డిమాండు వెంటనే ఊపందుకుంటుంది. దాన్ని ఎదుర్కొని సమస్యను పరిష్కరించటానికి కేంద్రం సిద్ధంగా లేదు. బీసీల వర్గీకరణకు ఏర్పాటుచేసిన జస్టిస్ రోహిణి కమిషన్ ఇచ్చిన నివేదికకే ఇంతవరకూ అతీగతీ లేదు. 2017లో ఏర్పాటైన ఆ కమిషన్‌కు నివేదిక ఇవ్వటానికే ఆరేళ్లు పట్టింది. దాని సిఫార్సులు ఏమిటో ఇప్పటికీ బయటపెట్టలేదు. రిజర్వేషన్లకు బయట ఉన్న కులాలన్నిటినీ అగ్రకులాలే అనుకుంటే అవన్నీ వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో ఉన్నాయి. అక్కడి ఎస్సీ, ఎస్టీ, బీసీ జాబితాలను పరిగణనలోకి తీసుకుని ప్రతి రాష్ట్రానికి నిర్దిష్టంగా అగ్రకుల జాబితానో, నాన్ రిజర్వేషన్ కేటగిరీ జాబితానో రూపొందించాలి. దీనికి కేంద్రం ఆమోదముద్ర వేయాలి. దానికీ ఇప్పటికిప్పుడు సిద్ధంగా లేదని తెలుస్తోంది. ఈ సమస్యలన్నిటినీ దృష్టిలో ఉంచుకుని గతాన్నే పునరావృతం చేయాలన్న నిర్ణయానికి కేంద్రం వచ్చినట్లు తెలుస్తోంది. 2011లో ఆనాటి యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ) ప్రభుత్వం బీసీ జనాభా ఎంతో తేల్చాలన్న డిమాండుకు తలవొగ్గి సామాజిక, ఆర్థిక, కుల గణన (ఎస్ఈసీసీ)ను చేపట్టింది. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ పెద్దను తమ కులం ఏమిటో చెప్పాల్సిందిగా కోరింది. తమ కులం పేరు గురించి తాము ఏమనుకుంటున్నారో అదే పొల్లుపోకుండా వారు చెప్పారు. వారు ఏది చెబితే దాన్ని గణన సిబ్బంది రాసుకున్నారు. కొందరు ప్రధాన కులం పేరు చెప్పారు. మరికొందరు ఉపకులం పేరు చెప్పారు. కులానికి చెందిన ప్రాంతనామాన్ని చెప్పినవారూ ఉన్నారు. గోత్రాన్ని చెప్పటానికే కొందరు పరిమితమయ్యారు. చాలామంది తాము ఫలానా వారమని ఇంటిపేర్లు చెప్పారు. ఇట్లా ప్రజలు ఏది చెబితే దాన్ని నమోదుచేసుకున్నారు. వాటన్నిటినీ పరిశీలిస్తే 45 లక్షల పైచిలుకు పేర్లు వచ్చాయి. ఇవన్నీ మీ కులం ఏమిటి? అన్న సాధారణ ప్రశ్నకు వచ్చిన స్పందనలు. ఇట్లా ఎందుకు నమోదు చేసారంటే, ప్రజలు తమ కులం గురించి తాము చెప్పుకున్న దాన్నే ప్రామాణికంగా తీసుకోవాలనీ, మీది ఫలానా కులమని చెప్పాలని ప్రభుత్వం వారిని బలవంతం చేయలేదనీ సమర్థించుకున్నారు. ప్రజలు చెప్పినదాన్ని యథాతథంగా నమోదుచేస్తే చిక్కులు రావా? అన్న ప్రశ్న ఆనాడూ వచ్చింది. ఆ చిక్కులను విడదీసి ప్రామాణికంగా కులాల లెక్కలను తేల్చటానికి నిపుణుల కమిటీని వేయాలని కూడా నిర్ణయించుకున్నారు. అట్లా ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ పనగారియ సారథ్యంలో (2015 జూలై) కమిటీని వేశారు. పార్లమెంటులో అడిగిన ఒక ప్రశ్నకు జవాబిస్తూ పనగారియా కమిటీ దాదాపుగా తనకు అప్పగించిన పనిని పూర్తిచేసిందని కేంద్ర ప్రభుత్వం సమాధానం కూడా ఇచ్చింది. ఇంతగా ఊరించి చివరికి 45 లక్షల పైచిలుకు పేర్లు ఎందుకూ పనికిరావని స్వయంగా సుప్రీంకోర్టుకు కేంద్రం తెలియచేసింది. ప్రజలు ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రామాణిక కులాల జాబితాను తయారుచేయలేమనీ కనీసం బీసీల సంఖ్యను కూడా తేల్చలేమని ఒక అఫిడవిట్‌ను సమర్పించింది. తమ దగ్గర ఉన్న జాబితా తప్పులతడక అని కేంద్రమే స్వయంగా చెప్పటంతో ఎస్ఈసీసీ నివేదిక కావాలని మహారాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రూ. 5,000 కోట్లకు పైగా ఖర్చుపెట్టి చేసిన దేశవ్యాప్త కులగణన ఎందుకూ పనికిరాకుండా పోయింది. అయితే కులాన్ని మినహాయించి ఆర్థిక, సామాజిక పరిస్థితులపై ఎస్ఈసీసీలో లభ్యమైన సమాచారం.. ప్రభుత్వ పథకాల అమలుకు బాగా పనికివస్తుందని పేర్కొంటూ దాన్ని అందరికీ అందుబాటులో ఉంచింది. ప్రజలు తమ కులం ఏదో తమంతట తాము చెప్పేదాన్నే పరిగణనలోకి తీసుకోవటం వల్ల ఎస్ఈసీసీ విఫలమైందని గట్టిగా వాదించిన కేంద్రం మరి ఇప్పుడు అదే విధానాన్ని ఎందుకు అవలంబిస్తోందన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. కృత్రిమమేధతో పాటు సంక్లిష్ట సమాచారాన్ని విశ్లేషించటానికి ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఆ తరహా చిక్కుముడుల నుంచీ గట్టెక్కుతామని కేంద్ర అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో చిక్కుముడులు వీడతాయా? చరిత్ర పునరావృతం అవుతుందా? అన్నది సాంకేతిక పరిజ్ఞానంపైనే ఆధారపడి ఉండదు. రాజకీయ ప్రయోజనాలే సమాచార విశ్లేషణలను నిర్దేశిస్తాయి. కులగణను చాలా కాలం బీజేపీతో పాటు ఆరెస్సెస్ కూడా తీవ్రంగా వ్యతిరేకించింది. 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి కులగణననూ, ఆయా కులాల జనాభా సంఖ్యకు అనుగుణంగా రిజర్వేషన్లు ఉండాలనే డిమాండ్లనూ కాంగ్రెస్ పార్టీ బలంగా ముందుకు తేవటంతో బీజేపీ దృక్పథంలో మార్పు వచ్చింది. అనూహ్యంగానే కేంద్ర మంత్రివర్గం జనాభా లెక్కలతో పాటు కులగణనను కూడా చేపట్టాలని నిర్ణయించింది. అంతకుముందు కేరళలో జరిగిన ఆరెస్సెస్ సమావేశంలో కూడా కులగణనపై సాగిన సానుకూల చర్చలూ అందుకు దోహదం చేశాయి. హిందూత్వ భావన పునాదిగా ప్రజల్లో ఏకీకరణ రావటానికి కులాలు అడ్డంకిగా ఉన్నాయన్న అంచనా ఆరెస్సెస్‌లో ఒకప్పుడు బలంగా ఉండేది. కులంపోవాలి.. మతం మిగలాలి.. ప్రజల మధ్య సాంస్కృతిక ఐక్యత మతం ఆధారంగా జరగాలి.. అన్నదే సంఘ్ పరివార్ సిద్ధాంత భూమికగా చలామణి అయింది. దీనికి భిన్నంగా ఏ విశ్లేషణ వచ్చినా, ఏ సమాచారం ఉన్నా దాన్ని హిందువుల ఏకీకరణకు అడ్డంకిగానే భావించింది. మరిప్పుడు కుల లెక్కలు ఆ ఏకీకరణకు ఇబ్బందిగా మారటాన్ని అంత తేలికగా తీసుకోకపోవచ్చు. మార్గాంతరాలనూ అన్వేషించవచ్చు. జనాభా లెక్కలు వచ్చే ఏడాది చివరినాటికి తేలినా కుల లెక్కలు మాత్రం అంత తొందరగా బయటకు రావు. రాజకీయంగా ఎన్నో సమీకరణాలను పరిశీలించిన తర్వాతే అవి ఏ రూపంలో వస్తాయన్నది నిర్ణయం అవుతుంది. బిహార్, తెలంగాణల్లో జరిపిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, కులగణన సర్వేల్లో విడివిడిగా కులాల లెక్కలను సేకరించారు.

## పిగ్లీపురంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం.. సీసీ రోడ్డుకు శంకుస్థాపన





అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 14 సమయం ప్రతినిధి: అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని పిగ్లీపురం గ్రామంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి, రూ.25 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్ కోట ప్రభాకర్‌రెడ్డి, గ్రామ పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని ప్రైమరీ, హైస్కూల్ నుంచి దేశ్‌ముఖ్ విలేజ్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి అందిస్తున్నామని, తమ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం చేసిన లబ్ధిదారుల దంపతులను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కోట ప్రభాకర్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి, గ్రామ అభివృద్ధికి మరింత సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ దుర్గం నరసింహ యాదవ్, వార్డు సభ్యులు జక్కుల శివకుమార్ యాదవ్, జక్కుల ఝాన్సీ, ఆంజనేయులు యాదవ్, వర్ధన్ లావణ్య, హనుమంత్ యాదవ్, జక్కుల పరమేష్ యాదవ్, పంది మురళీకృష్ణ, కొండ రమేష్ యాదవ్, కలను హరిణి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## అంబేడ్కర్, జ్యోతిబా పూలే స్ఫూర్తితో విద్యార్థులు చదువుకోవాలి: సీఎం రేవంత్ రెడ్డి..

మొదటి పేజీ తరువాయి

సామాజిక చైతన్యంతో తమ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. మాదిగలు దశాబ్దాలుగా పోరాడుతున్న ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించామని చెప్పారు. దేశంలో బీసీ జనగణన చేపట్టడానికి ఎవరూ ధైర్యం చేయలేదని, బ్రిటిష్ పాలన తర్వాత తొలిసారిగా బీసీల లెక్క తేల్చామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఏడాదిలోనే కులగణన పూర్తి చేశామని తెలిపారు. కులగణనలో కొందరు మాజీ ముఖ్యమంత్రులు, మాజీ మంత్రులు పాల్గొనకుండా వ్యతిరేకించారని ఆరోపించారు. బలహీన వర్గాలకు ఉద్యోగాలు, అవకాశాలు కల్పించాలంటే వారి జనాభా లెక్కలు తెలియాలని, అందుకే కులగణన చేపట్టామని సీఎం వివరించారు. ప్రతి సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రజలను గొర్రెలు, బర్రెలు పెంచుకోవాలని, చెప్పులు కుట్టుకోవాలని, చేపలు పట్టుకోవాలని చెప్పిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. బీసీలు చదువుకుని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, మంత్రులు, ఎమ్మెల్యేలు కావద్దా? అని ప్రశ్నించారు. 'చదువు ఒక్కటే తలరాతలను మారుస్తుంది. చదువు ఒక్కటే పరిష్కారం.. అదే మార్గం' అని సీఎం అన్నారు. తెలంగాణను ప్రపంచ పటంలో నిలపడానికి విద్యే మార్గమని పేర్కొన్నారు. జ్యోతిబా పూలే స్ఫూర్తితో విద్యార్థులు భవిష్యత్తులో చట్టసభల్లోకి రావాలని, డాక్టర్లు, ఇంజినీర్లు కావాలని ఆకాంక్షించారు. నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించే బాధ్యత తనదేనన్నారు. 'మీ బంగారు భవిష్యత్తు కోసం రోజుకు 18 గంటలు పనిచేస్తా. ఇంత మంచి అవకాశం మళ్లీ రాదు. ఈ ప్రభుత్వాన్ని కొనసాగించాలి' అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేయాలి: రాష్ట్రపతి ముర్ము

మొదటి పేజీ తరువాయి

దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు దేశ ప్రజలంతా కలిసికట్టుగా పనిచేయాలని ఆమె సూచించారు. రాజ్యాంగం దేశ ప్రజలకు అందించిన హక్కులు, బాధ్యతలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి అన్నారు. యువత తమ ప్రతిభను ఉపయోగించుకుని తమ స్వప్నాలను సాకారం చేసుకోవడంతో పాటు దేశ ప్రగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో స్ఫూర్తిని నింపిన 'వందేమాతరం' గేయాన్ని గౌరవించాలని రాష్ట్రపతి ప్రజలను కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన న్యాయవ్యవస్థ, చట్టసభలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

## బీచుపల్లి ఆంజనేయ స్వామి సన్నిధిలో పార్లమెంటు సభ్యురాలు డికె. అరుణమ్మ ప్రత్యేక పూజలు..



ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం ప్రారంభించి, హోమం నిర్వహించిన ఎంపీ

గద్వాల : జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా బీచుపల్లి పుణ్యక్షేత్రంలో స్వామి వారిని మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యురాలు డికె అరుణమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది .. ఈ సందర్భంగా ఆలయ ఈవో పురేందర్ పూర్ణకుంభ స్వాగతం పలికి ఆంజనేయ స్వామి సన్నిధిలో ఉన్న కళ్యాణ మండపానికి శ్రీ వ్యాసరాయ కళ్యాణ మండపం గా నామకరణం చేసి పుణ్యవచనము, శాంతి హోమం, గణపతి పూజ, నవగ్రహాల పూజ నిర్వహించడం జరిగింది. వివాహాలు జరిగే వారికి సకల శుభాలు కలిగి శుభప్రదంగా ఉండాలని వసంతులన్నీ సమకూర్చి పున ప్రారంభించడం జరిగింది.

## చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ఆండాళ్ తిరునక్షత్రోత్సవం

హైదరాబాద్ నల్లకుంట, ఆగస్టు 14 సమయం ప్రతినిధి: హైదరాబాద్ నల్లకుంటలోని నర్మదా సంఘ భవనంలో తెలంగాణ రాష్ట్ర చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో ఆండాళ్ తిరునక్షత్రోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సంఘం అధ్యక్షులు వేణుమాధవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా ఆండాళ్ అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మండలి అధ్యక్ష, కార్యదర్శులతో పాటు సంఘ మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం కార్యదర్శులు, పాలకమండలి సభ్యులు, మహిళా మండలి సభ్యులు, సంఘ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## ఎఫ్ఆర్సీఏ బిల్లు: సేవకు రక్షణ, అక్రమాలకు శిక్ష!

సమయం ప్రతినిధి: సహాయం ఎవరు చేసినా సంతోషంగా ఆహ్వానిద్దాం... కానీ దాని వెనుక ఉండే ప్రయోజనాలపై మాత్రం కన్నేసి ఉంచుదాం! విదేశీ విరాళాల నియంత్రణ (ఎఫ్ఆర్సీఏ) సవరణ బిల్లు--2026 ఆంతర్యం ఇదే. దేశవ్యాప్తంగా బడులు, ఆస్పత్రులు, సేవా సంస్థలు, విపత్తు సహాయక చర్యలకు విదేశీ విరాళాలు ఎంతో చేయూతనందించాయి. సమాజానికి మేలు చేసిన ఆయా సంస్థల సేవలను మనం ఖచ్చితంగా గుర్తించి తీరాలి. అయితే, విదేశీ నిధులు మన దేశీయ సామాజిక, వ్యవస్థాగత పరిధిలోకి వచ్చినప్పుడు... లెక్కాజమానా లేకపోతే ఎలా? ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తున్నది? ఎక్కడికి వెళ్తున్నది? దేనికోసం ఖర్చు చేస్తున్నారు? అంతిమంగా దానివల్ల ఎవరి ప్రయోజనాలు నెరవేరుతున్నాయి?... ఇలాంటి ప్రశ్నలు స్వచ్ఛంద సంస్థలను అనుమానించాలనే ఉద్దేశంతో వేస్తున్నవి కావు. విదేశీ నిధుల ప్రవాహాన్ని క్రమబద్ధీకరించేటప్పుడు ఏ ప్రజాస్వామ్య దేశమైనా అడిగే ప్రాథమిక ప్రశ్నలు.

గతేడాది మార్చి 25న లోక్‌సభ ముందుకు వచ్చిన ఈ ఎఫ్ఆర్సీఏ సవరణ బిల్లు, పాలనలోని ఒక ప్రధాన లోపాన్ని సరిదిద్దేందుకే రూపుదిద్దుకుంది. అంతమాత్రాన విదేశీ సహాయానికి మన దేశం తలుపులు మూసేస్తోందని కాదు. ఏదైనా సంస్థ ఎఫ్ఆర్సీఏ రిజిస్ట్రేషన్ రద్దయినా, దాన్ని వెనక్కి తీసుకున్నా లేదా దాని గడువు ముగిసినా... ఆ సంస్థకు చెందిన విదేశీ నిధులు, ఆస్తుల నిర్వహణపై ఒక స్పష్టమైన, చట్టబద్ధమైన విధానాన్ని ఈ బిల్లు తీర్మానిస్తుంది. ఒక సంస్థ ఎఫ్ఆర్సీఏ హోదా కోల్పోవడంతోనే కథ ముగిసిపోదు కదా! మరి ఆ సంస్థ కట్టిన ఆస్పత్రి ఏమవుతుంది? ఏర్పాటు చేసిన బడి పరిస్థితేంటి? విదేశీ నిధులతో సమకూరిన ఆస్తులు ఏమవుతాయి? ఆ ఆస్తులు ప్రజా సంక్షేమానికి కాకుండా వేరే దారుల్లోకి మళ్లకుండా చూసే బాధ్యత ఎవరిది? ఈ ప్రశ్నలన్నింటికీ స్పష్టమైన సమాధానమే బిల్లులోని 'నిర్దేశిత అధికారి' వ్యవస్థ. దీని ప్రకారం, మొదట ఆ ఆస్తుల పర్యవేక్షణ తాత్కాలికంగా ఈ అధికారి వద్దే ఉంటుంది. ఒకవేళ ఆ సంస్థ నిర్ణీత గడువులోగా తన లైసెన్సును పునరుద్ధరించుకున్నా లేదా కొత్త సర్టిఫికెట్ పొందినా... చట్టప్రకారం ఆ ఆస్తులను, మిగిలిన నిధులను తిరిగి ఆ సంస్థకే అప్పగిస్తారు. గడువు దాటినా పునరుద్ధరణ జరగకపోతేనే ఆ ఆస్తులు శాశ్వతంగా ప్రభుత్వం ఆధీనంలోకి వస్తాయి. వాటిని ప్రజా ప్రయోజనాల కోసమే వినియోగిస్తారు. ఆస్పత్రి అంటే కేవలం నాలుగు గోడలు కాదు. ఒక రోగికి అది పునర్జన్మ. బడి అంటే ఒట్టి భవనం కాదు. చిన్నారులకు అది రేపటి భవిష్యత్తు. వృద్ధాశ్రమం లేదా అనాథ శరణాలయం అంటే కేవలం సంస్థాగత ఆస్తి కాదు. అక్కడున్నవారికి అది కొండంత ఆసరా. అందుకే చట్టం అమలు చేసేటప్పుడు తప్పు చేసిన వారిపై చర్యలు ఉండాలే తప్ప, దానిపై ఆధారపడిన లబ్ధిదారులకు ఎలాంటి నష్టం జరగకూడదు. కఠినమైన నియమాలు ఉన్నప్పుడు చట్టబద్ధమైన ప్రక్రియ కూడా అంతే పారదర్శకంగా ఉండాలి. అందుకే ఈ చట్టంలో నిర్ణయాల సమీక్షకు, న్యాయపరమైన అప్పీలుకు తగిన అవకాశాలు కల్పించారు. నిబంధనలను ఉల్లంఘించినప్పుడు తీసుకునే చర్యలకు, వాటిని అమలు చేసే తీరులోనే అసలైన నిష్పాక్షికత ప్రతిబింబిస్తుంది. అదే సమయంలో, కావాలని చేసే అక్రమాలకు, సాంకేతిక లేదా పరిపాలనాపరమైన పొరపాట్లకు మధ్య తేడాను స్పష్టంగా చూడాలి. విదేశీ నిధులను కావాలని చట్టవిరుద్ధ పనులకు మళ్లించే సంస్థలను, కేవలం సాంకేతిక కారణాల వల్ల తప్పు చేసిన సంస్థలను ఒకేలా చూడలేం. మరొక ముఖ్యమైన అంశం 'మిశ్రమ ఆస్తులు'. ఒక సంస్థకు చెందిన ఆస్తుల్లో విదేశీ విరాళాలతో పాటు భారతీయ విరాళాలు, ప్రభుత్వ సాయం లేదా వారి సొంత ఆదాయం కూడా కలిసి ఉండవచ్చు. అందువల్ల నియంత్రణ వ్యవస్థ అనేది విదేశీ నిధులతో వచ్చిన ఆస్తులను సరిగ్గా గుర్తిస్తూనే, భారతీయ విరాళాలకు తగిన రక్షణ కల్పించేలా ఉండాలి. అలాగే, ఆరాధనా స్థలాల విషయంలో ఈ బిల్లు చూపిన చొరవ ప్రశంసనీయం. ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చిన ఆస్తుల్లో ప్రార్థనా మందిరాలు ఉన్నట్లయితే, వాటి ఆధ్యాత్మిక స్వరూపాన్ని యథాతథంగా కాపాడాలని ఈ చట్టం చెప్తున్నది. విదేశీ నిధుల విషయంలో పారదర్శకత ఎందుకు అవసరమో మన దేశ అనుభవాలే చెప్తాయి. పార్లమెంటరీ నివేదికల ప్రకారం, 2019 నుంచి 2022 మధ్య కాలంలోనే దాదాపు 13,520 సంస్థలకు సుమారు రూ.55,741 కోట్ల విదేశీ విరాళాలు వచ్చాయి.




# కళాశాలను వేరే ప్రాంతానికి తరలించడం సరికాదు

మక్తల్ : మఖ్తల్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించిన వసతుల అభివృద్ధి, సమస్యల పరిష్కార విషయమై కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులు అలాగే ాబీవీపీ మఖ్తల్ శాఖ చేసిన అనేక ప్రయత్నాల దృష్ట్యా చివరికి ఆగస్టు 13 వ తేదీన నారాయణపేట జిల్లా డిఐఈఓ సుదర్శన్ గారు కళాశాల ను సందర్శించారు. డి ఐ ఈ ఓ సుదర్శన్ కళాశాల మరియు ఏబీవీపీ వారికి ఇచ్చిన సమాచారం మేరకు కళాశాలను భవనం యొక్క నాణ్యతను పరీక్షించి రిపోర్ట్ అందించమని తమకు ఆదేశాలు వచ్చాయని దానిని అనుసరించి తాము అందించే నివేదికను పరిశీలించి తదుపరి చేయవలసిన కార్యాచరణ నిర్ణయిస్తారని తెలిపారు. ఇది ఇలా ఉండగా కొన్నిరోజుల క్రింద కొన్ని దినపత్రికలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మార్పుకు అనుమతులు అని కొన్ని పత్రికలలో వచ్చిన విషయమై ఏర్పడిన సందిగ్ధం నిమిత్తం ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినయ్ కుమార్ వివరిస్తూ ప్రస్తుతం మరమ్మతుకు ఉన్నటువంటి భవనంలో కేవలం నాలుగు గదులు మాత్రమే వినియోగంలో ఉన్నాయని ఆ భవనం మరమ్మత్తు కోసం పూర్తి కళాశాలను వేరే ప్రాంతానికి తరలిస్తామని చెప్పడం,వేరే ప్రాంతానికి తరలించి అక్కడ తాత్కాలిక వసతి కల్పిస్తామని కళాశాల సిబ్బందికి చెప్పారని ,వీలైనంత త్వరగా కళాశాల తరలింపుకు సహకరించాలని కలశాల ప్రిన్సిపాల్,సిబ్బందిని కోరడం విద్యార్థులలో గందరగోళానికి తావిస్తోందని ఐ×జుూ దృష్టికి తీసుకెళ్లారు. చాలి చాలని వసతులతో ఉన్నప్పటికీ 700 మంది విద్యార్థులతో జిల్లాలోని అత్యధిక సంఖ్య కలిగిన కళాశాలగా పేరొందిన మఖ్తల్ కళాశాలను వేరొక ప్రాంతానికి శాశ్వతంగా తరలిస్తే ఈ విద్యా సంవత్సర నిర్వహణకు , అలాగే వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్లపై కూడా దీని ప్రభావం పడుతుందని అన్నారు. కళాశాల తరలింపు విషయమై కళాశాల విద్యార్థులు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కళాశాల మైదానంలోనే



తాత్కాలిక గదులను నిర్మించాలని , కళాశాల భవనం ఉన్న స్థానములోనే అన్ని రకాల వసతులతో వీలైనంత త్వరలో నూతన కళాశాల భవన నిర్మాణం పూర్తి చేయాలనీ కోరారు. ప్రభుత్వ కళాశాల తరలింపు,పునర్నిర్మాణం విషయమై ఏర్పడిన సందేహాలను నివృత్తి చేయాలని ఆగస్టు 14న కళాశాల విద్యార్థులు తరగతుల బహిష్కరణ చేసి కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కళశాల విద్యార్థులకు సంఘీభావంగా ఎబివిపి రాష్ట్ర నాయకులు వినయ్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే నిధులు కూడా మంజూరు అయిన డిగ్రీ కళాశాలకు కూడా స్థల కేటాయింపు, నిర్మాణాలపై స్పష్టత లేదని ప్రభుత్వ జూనియర్ కళశాల కుడా తరలింపు చేస్తే

**కళాశాల మైదానంలోనే తాత్కాలిక గదులను నిర్మించాలి.**
**కళాశాల స్థానం లోనే శాశ్వత భవన నిర్మాణం చేపట్టాలి.**
**కళాశాల తరలింపు యోచనను వ్యతిరేఖిస్తూ తరగతులను బహిష్కరించిన విద్యార్థులు.**
**ప్రభుత్వ జూనియర్ కళాశాల తరలింపుపై అధికారులు స్పష్టత ఇవ్వాలి.**
**- ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినయ్ కుమార్**

విద్యార్థులకు తల్లిదండ్రులకు గందరగోళం ఏర్పడుతుందని కాబట్టి వీలైనంతవరకు కళాశాల ప్రాంగణంలోనే తాత్కాలిక వసతులు ఏర్పాటు చేసి వీలైనంత త్వరగా ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత భవనాన్ని పునర్నిర్మాణం చేసి కళాశాలకు కావలసిన అదనపు గదులు,బాలబాలికలకు విశ్రాంతి గదులు,టాయిలెట్స్, ఇతర వసతులు సమకూర్చి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మరింత వైభవాన్ని చేకూర్చాలని డిమాండ్ చేసారు.ప్రభుత్వ కళాశాల మైదానం ఇంకా కళశాల సమస్యల విషయంలో ఎబివిపి నిరంతర పోరాటం కొనసాగిస్తుందని విద్యార్థుల సంక్షేమం విషయమై విద్యాశాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు కలిసి ఒక స్పష్టమైన సమాచారం ఇవ్వాలని, శాశ్వత పరిష్కారం అందించాలని ఎబివిపి తరపున కోరారు. లేని యెడల కళాశాల విద్యార్థులు , పూర్వ విద్యార్థులు, మఖ్తల్ యువకులు,అఖిల పక్ష నాయకులూ,గ్రామపెద్దల సహకారంతో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని అన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు,,మాయ ,నవీన్ ,చరణ్, శ్రీకాంత్, అక్షయ్,నాని,శివ, అనిల్,మహేష్, శ్రీధర్,రవి, పెద్ద ఎత్తున కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## అమరచింత లో అనవసరంగా వేసిన స్పీడ్ బ్రేకర్‌లను తొలగించాలి

అమరచింత : అమరచింత పట్టణంలో అనవసరంగా వేసిన స్పీడ్ బ్రేక్ లను తొలగించాలని మున్సిపల్ కమీషనర్ నూరల్ నజీబ్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా DYFI జిల్లా అధ్యక్షులు టీ. రాఘవేంద్ర మాట్లాడుతు అమరచింత మున్సిపాలిటీలి చాలా వార్డులలో అనవసరమైన స్పీడ్ బ్రేక్లు వేయడం వల్ల వృద్ధులను ఏదన్నా పని మీద బస్టాండ్ కి లేదా హాస్పిటల్ కి తీసుకుపోతున్న సందర్భంలో ఉన్న రోగాలకన్నా లేని రోగాలు బాడీ నొప్పులు వస్తున్న పరిస్థితి బాలింతలను హాస్పిటల్ కు తీసుకెళ్లాలని చిన్నపిల్లలను హాస్పిటల్ కు తీసుకెళ్లాలన్నా ఇంటి నుండి బయలుదేరి బస్టాండ్ కి వచ్చేసరికి ఒక 7 లేదా 8 స్పీడ్ బ్రేక్లను దాటుకొని బస్టాండ్ కు వచ్చే పరిస్థితి అన్ని వార్డుల్లో ఏర్పడిందని కాబట్టి వెంటనే మున్సిపల్ కమిషనర్ స్పందించి అనవసరమైనటువంటి స్పీడ్ బ్రేక్ లను గుర్తించి వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు షారుఖ్, తబ్రైస్ షారుఖ్,రాజీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఖాన్ దొడ్డి పాఠశాలలో తాగునీటి సమస్య మంత్రి చొరవతో తక్షణ పరిష్కారం



మక్తల్ : కృష్ణ మండలం ఖాన్ దొడ్డి గ్రామంలోని పాఠశాలల్లో నెలకొన్న తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచు కొని, ఈ విషయాన్ని మినిస్టర్ వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా నూతనంగా బోరు వేయించి తాగునీటి సమస్యను పరిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సంగోళ్ల వెంకటేష్ , ఉపసర్పంచ్ దుకాణం శ్రీనివాస్ , మంత్రి సోదరుడు వాకిటి శేషగిరి , కృష్ణ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజప్ప గౌడ్ , మాజీ మండల అధ్యక్షుడు రాజప్ప గౌడ్ , యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సర్వరాజ్ , మాగనూరు మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ , మాజీ ఎంపీటీసీ వాకిటి నారాయణ , ఉపాధ్యాయులు మోహన్ సార్, వెంకటేష్ . నర్సప్ప.నూకలి తిప్పయ్య , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పల్లె సురేష్, సుదర్శన్, తమ్మప్ప తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కృష్ణ మండలం సోషల్ మీడియా కోఆర్డినేటర్. తారేష్. అభిమానులు పాల్గొన్నారు.

## జెన్‌జీ: కొత్త తరమా, పాత చట్రమా?

సమయం ప్రతినిధి: 'జెన్ జీ' అన్నది ఇప్పుడు నూతన ఉత్సాహాన్ని గుర్తుకు తెచ్చే పదం. ఈ 'జెన్ జీ' తరానికి ఇప్పుడో హీరో వర్షిప్ ఏర్పడింది. ఈ తరం ముందు తరాల్లా కాదనీ; భిన్నమైన ఆలోచనలతో ప్రతిదాన్నీ ప్రశ్నించే తరమనీ అంతా చెప్పుకుంటున్నారు. ప్రతి ఉద్యమం ఏదో ఒక తాత్కాలిక లక్ష్యంతోనే మొదలవుతుంది. కానీ అది వదిలివెళ్లే పాదముద్రలు దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. మన స్వాతంత్ర్యోద్యమం మొదలుకొని, చైనా సాంస్కృతిక విప్లవం దాకా ఎన్నో ఉద్యమాలు తాత్కాలిక విజయం కోసమే పని చేసినప్పటికీ, తదనంతరం ఆయా సమాజాల్లోని విలువలను ఎలా తలకిందులు చేశాయో చూశాం. ప్రతి ఉద్యమం తెచ్చే మార్పు ఆహ్వానించదగ్గదే. అయితే ఆ ఉద్యమం ప్రకటించిన భావనలు, విధానాలు, తీరుతెన్నులు... ప్రతి ఒక్కటీ సరైనదే అని మాత్రం చెప్పలేం. కార్పొరేట్ పరిభాషలో చెప్పాలంటే– ప్రొడక్ట్ మంచిదే కావచ్చు, కానీ అది తయారు చేయడానికి వాడిన టెక్నాలజీ కలగజేసిన వాతావరణ కాలుష్యం, దాని పరిణామాలు కొంతకాలం తర్వాతే తెలుస్తాయి. జెన్ జీ అన్నది నేటి యువతరానికి వాడుతున్న పర్యాయపదం. అంటే మానవ చరిత్రలో, పుట్టుకతోనే మొబైల్ ఫోన్స్, ఇంటర్నెట్, డిజిటల్ టెక్నాలజీని చూస్తూ వచ్చిన మొట్టమొదటి తరం. దీని ముందుతరం 'మిలీనియల్స్' (1981--96 మధ్యలో పుట్టినవాళ్లు). 'అనలాగ్', 'డిజిటల్' తరాన్ని ఒకేసారి చూస్తూ దానిని 'అడాప్ట్' చేసుకున్న మొదటి తరం ఈ మిలీనియల్స్. వీళ్లను సాధారణంగా 'అడాప్టబిలిటీ'కి ప్రతీకలుగా చూస్తారు. అంటే ఏ కొత్త మార్పుకైనా సులువుగా మారిపోతారు అని. ఇంతకు ముందు కూడా యువతరాలు సమాజాన్ని ప్రశ్నించి ఉద్యమాలు చేసిన సందర్భాలెన్నో ఉన్నాయి. 'నవనిర్మాణ్ ఆందోళన్' అని గుజరాత్‌లో 1974లో హాస్టల్ మెస్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం చివరకు అక్కడి ముఖ్యమంత్రి రాజీనామాకు దారితీసింది. తమాషాగా అదే రాజకీయ నాయకుడు చిమన్‌భాయ్ పటేల్ సొంత పార్టీని స్థాపించి (కిసాన్ మజ్దూర్ లోక్ పక్ష్) 1975 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేశారు, ఆపై 1990లో మళ్లీ గుజరాత్ ముఖ్యమంత్రిగా తిరిగి వచ్చారు. అది వేరే సంగతి. తెలంగాణ ఉద్యమాన్ని దగ్గరుండి నడిపింది అప్పటి యువతరమైన విద్యార్థులే. రోహిత్ వేముల మరణాన్ని నిరసిస్తూ నడిచింది అప్పటి తరం విద్యార్థులే. ఇలా చరిత్ర చూస్తే, ప్రతి తరమూ తమ కాలంలో ఏవో ఉద్యమాలు చేసి సంచలనాలు సృష్టించినదే.

## బీడీ కార్మికులకు చేయూత పెన్షన్లలో అవకాశం కల్పించాలి




హైదరాబాద్ : బీడీ కార్మికులకు "చేయుత పెన్షన్" అప్షన్ లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నాడు హైదరాబాద్ ప్రజా భవన్ లో ప్రజావాణి ఇంచార్జ్ చిన్నా రెడ్డి ,ప్రజాభవన్ నోడల్ ఆఫీసర్ ప్రకాష్ రావు ని, తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ ని తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ (TUCI) రాష్ట్ర నాయకత్వం కలిసి విజ్ఞప్తి చేసింది. తెలంగాణ రాష్ట్రంలో బీడీ కార్మికులకు పెన్షన్ లు రాక చాలా ఇబ్బందులు పడు తుం డగా తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గత తెరాస ప్రభుత్వం అధికారం లో ఉన్నప్పుడు అనేక ఉద్యమాలు చేస్తే బీడీ కార్మికులకు జీవన భృతి పెన్షన్ ఇస్తామని PF కట్టాఫ్ తేది పెట్టి కొంత మందికి ఇచ్చారు.మిగతా వారికీ ఇప్పుడు అప్పుడు అంటు కాలయాపన చేస్తూ వచ్చారు. గత 8,9 సంవత్సరాలనుండి బీడీ కార్మికులకు పెన్షన్ లు ఇవ్వకుండా ఆన్ లైన్ బందు చేశారు. దాంతో కార్మిక వర్గం చాలా నష్ట పోయింది.ప్రస్తుతం ఉన్న ప్రజా ప్రభుత్వం అందరికి చేయూత పెన్షన్స్ ఇస్తామని అధికారం లోకి వచ్చి 3 సంవత్సరాలు గడుస్తున్న ఇవ్వలేదు. ఈమధ్యన కొన్ని రకాల

**- టి యు సి ఐ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో చీఫ్ సెక్రటరీ, ప్రజాభవన్ ఇన్చార్జిలకు విజ్ఞప్తి**

పెన్షన్స్ కు మాత్రమే దరఖాస్తు పెట్టుకోవడానికి అవకాశం కల్పించారు. వాటిలో బీడీ కార్మికులు పెన్షన్స్ కు దరఖాస్తు చేసుకునేందుకు మాత్రం అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. కనుక ఇప్పటికయినా ప్రభుత్వం వెంటనే బీడీ కార్మికుల పెన్షన్స్ కూడా ఇవ్వాలని మా తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ (TUCI) రాష్ట్ర అధ్యక్షులు V కృష్ణ, ప్రధాన కార్యదర్శి వీ నరేందర్, రాష్ట్ర నాయకులు JN దేవదానం,k రాజన్న,M వెంకట్, రాజేశ్వర్, బక్కన్న, P అరుణ్ కుమార్, కోళ్ల వెంకటన్న, వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు C రాజు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**నాగర్ కర్నూల్‌లో ఆగస్టు 15న డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుల చేతుల మీదుగా పంపిణీ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**

నాగర్ కర్నూల్ సమయం ఆగస్టు 14 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆగస్టు 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనున్న నేపథ్యంలో నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోనూ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సంగారెడ్డి జిల్లాలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని, ఈ కార్యక్రమానికి అనుసంధానంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుల చేతుల మీదుగా లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డులను అందజేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా డిజిటల్ విధానాన్ని మరింత పటిష్టం చేయడంలో భాగంగా ఈ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లాకు చెందిన ఎం.పీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, రేషన్ డీలర్లు, రేషన్ కార్డు లు కలిగిన లబ్ధిదారులు, వివిధ శాఖల అధికారులు, సంబంధిత సిబ్బంది, డిజిటల్ రేషన్ కార్డుల లబ్ధిదారులు హాజరుకానున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత కేశవ పాటిల్ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. డిజిటల్ రేషన్ కార్డుల ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు ప్రభుత్వ రేషన్ సదుపాయాలను పారదర్శకంగా, సులభతరంగా అందించడంతో పాటు, లబ్ధిదారుల వివరాలను డిజిటల్ విధానంలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో కార్యక్రమానికి హాజరయ్యే లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరానికి చేరుకోవాలని సూచించారు.

## కార్మిక,ప్రజల సామాజిక అభివృద్ధి శూన్యం



సమయం ప్రతినిధి: దేశానికి మతోన్మాద రాజకీయాలు ప్రమాదకరమని, కార్మిక, ప్రజల సామాజిక అభివృద్ధి శూన్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ ధ్వజమెత్తారు. మండల కార్య దర్శి జోగుల మల్లయ్య అధ్యక్షతన సీసీసీ కార్నర్ వద్ద శు క్రవారం సాయం త్రం విద్యా వైద్య ఉపాధి కోసం ప్రజాపోరు యాత్ర ముగింపు సభ జరిగిం ది. అంతకు ముందు షిర్కె కాలనీ చౌరస్తా నుంచి సీసీసీ కార్నర్ వరకు ఉరేగింపు నిర్వహించారు. సీసీసీ కార్నర్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో శంకర్ మాట్లాడుతూ కార్మికులు, రైతులు, కూలీలు,యువత, మహిళలు, సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం సెప్టెం బరు 1న చలో డిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, చలో డిల్లీని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి, రామడుగు లక్ష్మన్, నాయకులు మేకల దాసు, చంద్రశేఖర్, వీరభద్రయ్య, లింగయ్య, కారుకూరి నగేష్, ఖలేందర్, లింగం రవి, చంద్రక ళ, బాజీ సైదా, సమ్మయ్య, రాజేశ్వర్ రావు, కిషన్ రావు, రవీందర్, దేవి పోచన్న, పౌల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# పండుగ సాయన్న జయంతికి అధికారిక గుర్తింపు!

హైదరాబాద్, ఆగస్టు 14: ముదిరాజుల ఆరాధ్య దైవం, వీరుడు పండుగ సాయన్న జయంతిని అక్టోబర్ 22న అధికారికంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. త్వరలోనే దీనికి సంబంధించిన జీవో విడుదల చేస్తామని సీఎం హామీ ఇవ్వడంతో ముదిరాజ్ సమాజంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

**సచివాలయంలో సీఎంను కలిసిన**
**పండుగ సాయన్న జయంతి-వర్ధంతి నిర్ధారణ కమిటీ**

శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బోర్ర జ్ఞానేశ్వర్, మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి--వర్ధంతి నిర్ధారణ కమిటీ సభ్యులు కలిశారు. ప్రముఖ న్యాయవాది, పుస్తక రచయిత బెక్కం జనార్ధన్, పరిశోధకుడు మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్, పండుగ సాయన్న సామాజిక సేవా సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు గుగ్గిళ్ల కృష్ణ ముదిరాజ్ తదితరులు ముఖ్యమంత్రిని కలిసి పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించాల్సిన ఆవశ్యకతను వివరించారు.

**చిరకాల ఆకాంక్షకు కీలక ముందడుగు**

పండుగ సాయన్న చరిత్ర, ఆయన పోరాట స్ఫూర్తి, పేదలు--బలహీన వర్గాల కోసం చేసిన సేవలను కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని ముదిరాజ్ సమాజం చాలాకాలంగా కోరుతున్న విషయాన్ని వివరించారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందిస్తూ, అక్టోబర్ 22న జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు హామీ ఇవ్వడంతో పాటు త్వరలోనే జీవో విడుదల చేస్తామని స్పష్టం చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా జయంతి ప్రభుత్వం జీవో విడుదల చేస్తే ప్రతి సంవత్సరం అక్టోబర్ 22న రాష్ట్రవ్యాప్తంగా పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించే అవకాశం ఏర్పడనుంది. పండుగ సాయన్న చరిత్ర,



**అక్టోబర్ 22న అధికారికంగా నిర్వహణకు సీఎం హామీ**
**త్వరలోనే జీవో విడుదల**

సామాజిక సేవ, పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు చాటిచెప్పే దిశగా ఇది చారిత్రక ముందడుగుగా ముదిరాజ్ సమాజ ప్రతినిధులు అభివర్ణించారు.

**సంజీవ్ ముదిరాజ్ హర్షం**

ముదిరాజ్ సమాజం చిరకాలంగా కోరుతున్న ఆకాంక్షకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడం పట్ల మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ హర్షం వ్యక్తం చేశారు. పండుగ సాయన్న జయంతికి అధికారిక గుర్తింపు కల్పించే దిశగా సీఎం హామీ ఇవ్వడం ముదిరాజ్ సమాజానికి గర్వకారణమన్నారు. "ముదిరాజుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చే దిశగా సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ చారిత్రక ముందడుగు. అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతి అధికారికంగా నిర్వహించేలా త్వరగా జీవో విడుదల చేయాలి" అని సంజీవ్ ముదిరాజ్ కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బోర్ర జ్ఞానేశ్వర్‌కు ముదిరాజ్ సమాజం తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "అక్టోబర్ 22 ఇక ముదిరాజ్ సమాజ చరిత్రలో మరుపురాని రోజు" మిగిలిపోతుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# శంకుస్థాపనలకే పరిమితమైన మఖ్తల్ - నారాయణపేట ఫోర్‌లైన్ రోడ్డు - పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు ?

**రెండుసార్లు శంకుస్థాపన చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది ?**
**రెండు సార్లు శంకుస్థాపన జరిగినప్పటికీ పనులు ప్రారంభించడంలో ఎందుకు ఆలస్యం అవుతుందో ముఖ్యమంత్రి,మంత్రులు ప్రజలకు సమాధానం చెప్పాలి.**
**- బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య**

మక్తల్ : 2025 డిసెంబర్ 1న మక్తల్ నియోజకవర్గ హెడ్‌క్వార్టర్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మఖ్తల్-నారాయణపేట రోడ్డు అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. అనంతరం 2026 జూలై 13న మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి కలిసి రూ.237 కోట్లతో నిర్మించనున్న నాలుగు లైన్ల రోడ్డుకు మరోసారి శంకుస్థాపన చేసి పైలాన్ ఆవిష్కరించారు.

**రెండుసార్లు శంకుస్థాపన చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది?**

రెండు సార్లు శంకుస్థాపన జరిగినప్పటికీ పనులు ప్రారంభించడంలో ఎందుకు ఆలస్యం అవుతుందో ముఖ్యమంత్రి, మంత్రులు మఖ్తల్ నియోజకవర్గ ప్రజలకు, నారాయణపేట జిల్లా ప్రజలకు సమాధానం చెప్పాలని బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య డిమాండ్ చేశారు. నారాయణపేట జిల్లాకు వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితిని బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఈ రోడ్డుపై ఒక్కొక్క గుంత రెండు నుంచి మూడు అడుగుల లోతు వరకు ఉంది. ఇంత ప్రమాదకరమైన పరిస్థితిలో ప్రజలు, వాహనదారులు ఎలా ప్రయాణించాలి ? ఈ పరిస్థితిని ముఖ్యమంత్రి, మంత్రులు, ముఖ్యంగా మఖ్తల్ నియోజకవర్గ మంత్రి గుర్తించాలి" అని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులకు చిత్తశుద్ధి ఉంటే రోడ్డు పనులు ఏ తేదీన ప్రారంభిస్తారో, ఎప్పటిలోగా పూర్తి చేస్తారో స్పష్టంగా ప్రకటించాలని కొండయ్య సవాల్ చేశారు. మఖ్తల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న స్థానిక మంత్రి ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు ప్రజలు పడుతున్న ఇబ్బందులు కనిపించడం లేదా అని కొండయ్య ప్రశ్నించారు. ఈ రోడ్డుపై జిల్లా ఆసుపత్రికి వెళ్లే అంబులెన్సులు, అత్యవసర వైద్యం కోసం వెళ్లే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.



ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు ప్రయాణించే సమయంలో రోడ్డు పరిస్థితి కారణంగా తీవ్ర అవస్థలు పడుతున్నారని, అంబులెన్సులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి అభివృద్ధి పనుల అమలులో ఉన్న తేడాను ప్రజలు గమనించాలి అని కొండయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో చేపట్టిన భారత్‌మాల రహదారి పనులకు నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుండగా, మఖ్తల్-నారాయణపేట రోడ్డు విషయంలో మాత్రం శంకుస్థాపనలు జరిగినా పనులు ప్రారంభం కాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. శంకుస్థాపన చేసినా "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్న చందంగా రోడ్డు పనులు ముందుకు సాగకపోవడంపై కొండయ్య తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఈ రహదారి విషయంలో ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా వెంటనే పనులు ప్రారంభించాలని బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నారాయణపేట రోడ్డు విషయంలో బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు చేయాల్సి వస్తుందని అలాంటి పరిస్థితిని తీసుకురావద్దని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# దేశ ప్రధాని నరేంద్రమోది పిలుపుమేరకు ఈ రోజు దేవరకొండ నియోజకవర్గం ఉమ్మడి చందంపేట మండలంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



దేవరకొండ: చందంపేట: ఆగస్టు 14 (సమయం ప్రతినిధి) : దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఈరోజు చందంపేట మండలం పోలేపల్లి వద్ద హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో చందపేట అధ్యక్షులు గుంటోజు వినోద్ చారి నాగిళ్ళ ఆంజనేయులు నేరేడుగోమ్ము మండల అధ్యక్షులు . పాల్గొన్నారు

ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిలుగా బిజెపి ఎస్సి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు జిల్లా ఇంచార్జి అంకూరి నర్సింహా బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబెర్ పాత్లావత్ అంజి నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అంకురి నరసింహ. మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను అర్పించిన దేశభక్తులను స్మరించుకోవడం కోసమే ఈ తిరంగా యాత్ర నిర్వహించడం జరుగుతుంది అని,ఎందరో మహానుభావుల ప్రాణ త్యాగాలతో స్వాతంత్రం సిద్ధించింది అని,దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల చరిత్ర తెలుసుకోవాలని విద్యార్థులు వారి చరిత్రలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని,వందేమాతరానికి 150 సంవత్సరాలు నిండిన సందర్భంగా పార్లమెంట్లో ప్రత్యేక చట్టం చేయడం చాలా సంతోషకరమని దేశ సమైక్యత కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చెనముని రాములు మాజీ పట్టణ దేవరకొండ అధ్యక్షులు గుండాల అంజయ్య ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు నారాయణదాసు చండీశ్వర్ జిల్లా కార్యవర్గ సభ్యులు జింకల శ్రీశైలం రెడ్డి శంకర్ రాపోల్ శ్రీనివాస్ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు గుండ్లపల్లి వెంకటేష్ నాగిల్ల నిఖిల్ పులికంటి శివ ఆకాష్ రితేష్ శివ యాదయ్య శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ ఆధారిత ఎఫ్ఎల్ఎన్‌లో మహబూబ్‌నగర్‌దే అగ్రస్థానం

మహబూబ్‌నగర్, ఆగస్టు 14 (సమయం ప్రతినిధి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు అమలు చేస్తున్న కృత్రిమ మేధ ఆధారిత ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో నిలిచింది. జిల్లాలోని 79 ప్రభుత్వ పాఠశాలలు ఏఎక్స్ఎల్ కృత్రిమ మేధ వేదికలో నమోదై రాష్ట్రంలో అత్యధిక పాఠశాలలతో మొదటి స్థానాన్ని దక్కించుకున్నాయి. 2025 మార్చి 15న జిల్లాలో కేవలం 10 పాఠశాలలతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయడంతో 2025--26 విద్యా సంవత్సరంలో 49 పాఠశాలలకు విస్తరించింది. ప్రస్తుతం 2026--27 విద్యా సంవత్సరంలో ఆ సంఖ్య 79కి చేరింది. జిల్లాలోని మొత్తం 17 మండలాల్లోనూ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.

**సమిష్టి కృషితోనే సాధ్యం**

ఏఎక్స్ఎల్ కృత్రిమ మేధ వినియోగం, పనితీరులో మహబూబ్‌నగర్ జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమని జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఆమె అభినందించారు. రాష్ట్ర స్థాయి మండల విద్యాధికారుల సమావేశంలోనూ జిల్లాలో కార్యక్రమం అమలు తీరును ప్రత్యేకంగా ప్రశంసించినట్లు తెలిపారు.

**ఉత్తమ పాఠశాలలకు ప్రోత్సాహం**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5న ఏఎక్స్ఎల్ కార్యక్రమాన్ని అత్యుత్తమంగా అమలు చేస్తున్న పాఠశాలలను గుర్తించి ప్రత్యేకంగా అభినందించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు. అదేవిధంగా ఖాన్ అకాడమీ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేస్తున్న పాఠశాలలను కూడా ప్రశంసించనున్నట్లు వెల్లడించారు. ఉత్తమ పనితీరు కనబరుస్తున్న పాఠశాలలను ప్రోత్సహించడం ద్వారా ఇతర పాఠశాలలకు స్ఫూర్తి కల్పించాలన్నదే ఉద్దేశమని పేర్కొన్నారు.

విద్యార్థులు క్రమం తప్పకుండా కృత్రిమ మేధ ఆధారిత అభ్యసన కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజయకుమారి సూచించారు. ఇదే స్ఫూర్తితో విద్యారంగంలోని ఇతర కార్యక్రమాలను కూడా సమర్థంగా అమలు చేసి జిల్లాను మరింత ముందంజలో నిలపాలని ఆమె పిలుపునిచ్చారు.

# ఆగస్టు 15న మహబూబ్‌నగర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



మహబూబ్‌నగర్, ఆగస్టు 14 (సమయం ప్రతినిధి): ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా మంజూరైన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అర్హులైన లబ్ధిదారులు హాజరుకానున్నారు. అర్హులైన లబ్ధిదారులకు కార్యక్రమంపై ముందస్తు సమాచారం అందించి, వారు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారుల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# మట్టి తవ్వకాలకు అనుమతులు తప్పనిసరి:జిల్లా కలెక్టర్



(సమయం ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా గుట్టలు, ఇతర ప్రాంతాల్లో మట్టి తవ్వకాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమతులు తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఐడిఓసిలోని తన ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి వీసీ లో మట్టి తవ్వకాలపై ప్రీ ఆక్షన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గుట్టల నుంచి అనధికారికంగా మట్టి తవ్వకాలు జరిపే వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ఎక్కడెక్కడ గుట్టలు ఉన్నాయో వాటిని బ్లాక్లుగా విభజించి మైనింగ్, జియో లాజికల్ శాఖల సమన్వయంతో నిబంధనల ప్రకారం మట్టి తవ్వకాలకు వేలంపాట ద్వారా నిర్దేశిత సమయానికి లీజును ఖరారు చేస్తూ అనుమతులు మంజూరు చేయాలన్నారు. మట్టి తవ్వకాలకు అధికారికంగా అనుమతులు ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి మంచి ఆదాయం సమకూరుతుందన్నారు. జనావాసాలు ఉండే ప్రదేశాలకు కనీసం 200 మీటర్ల దూరంలోనే మట్టి తవ్వకాలు జరగాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, మైనింగ్ ఏడి ఆనంద్, సర్వే ఏడి నూకరాజు, భూగర్భ జల శాఖ డిడి మోహన్, తహసిల్దారులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్యూబా అధ్యక్షుడితే సిపిఎం ఘన నివాళి



వనపర్తి : భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు సిపిఎం వీపనగండ్ల మండల కమిటీ ఆధ్వర్యంలోలి క్యూబా మాజీ అధ్యక్షులు ఫెడరల్ క్యాస్ట్రో శతజయంతి ఉత్సవాలలో భాగంగా ఆయన చిత్రపటానికి సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జబ్బార్ మాట్లాడుతూ....1959 క్యూబా విప్లవానికి నాయకత్వం వహించి 2008 వరకు క్యూబా అధ్యక్షుడిగా పనిచేశారు. నాటి నుండి నేటి వరకు సోషలిస్టు దేశంగా కొనసాగుతున్నది. అమెరికాకు 90 మైళ్ళ దూరంలో ఉన్న క్యూబాను అమెరికా సామ్రాజ్యవాదం అనేక కుట్రలు కుతంత్రాలు చేసి ఆయనను హత్య చేయాలని విశ్వ ప్రయత్నాలు చేసినా అమెరికా సామ్రాజవాదానికి తలవంచకుండా క్యూబాను విప్లవ మార్గంలో నడిపించిన క్యూబా స్వాతంత్ర సామాజిక సమానత్వం కోసం పోరాడిన నాయకుడిగా పనిచేశాడు. ఈయన నాయకత్వంలో క్యూబా సామ్యవాద దేశంగా మారింది అనారోగ్య కారణంతో అధికార బాధితులను తన సోదరుడు. రాహుల్ కాస్ట్రోకు అప్పగించారు తన సోదరుడు కూడా కమ్యూనిస్టు విప్లవ భావాలతో క్యూబా దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని అమెరికా సామ్రాజవాదానికి వ్యతిరేకంగా ఆ దేశం పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని తెలిపారు. 2019 కరోనాకాలంలో ఆ దేశంలో ఉన్న డాక్టర్లు ప్రాణాలను లెక్కచేయకుండా ప్రపంచ దేశాలకు వెళ్లి వైద్య సేవలు అందించారని వారు అన్నారు. ఇలాంటి క్యూబా మార్గంలో మనం కూడా పోవాలని ఫెడరల్ క్యాస్ట్రో ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మండ్లరాజు వీపనగండ్ల మండల నాయకులు. సిహెచ్ వెంకటయ్య. జక్కుల ఆశన్న. నక్క ఈశ్వర్. రామకృష్ణ. వెంకటేష్. గడ్డికోపుల మహేష్. నల్లబోతుల బాలస్వామి తదితర సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేద ప్రజల ఎన్నో ఏళ్ల కల ప్రజాపాలన
# సీఎం గారి నాయకత్వంలో నెరవేరినది





సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా ఈరోజు గద్వాల నియోజకవర్గం గట్టు మండలంలో పరిధిలో పెంచికల పాడు గ్రామం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు హాజరయ్యారు. గట్టు మండలంలో పరిధిలో పెంచికల పాడు గ్రామానికి చెందిన కు మాల సుమిత్ర w/o మాల రాజు లిమంజూరు కావడం జరిగినది . నేడు ఇల్లు నిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే గారు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది. నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే గారు కానుకను అందజేశారు. ఎమ్మెల్యే గారికి లబ్ధిదారులు శాలువా కప్పి పుష్పగుచ్చం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ .... నూతన ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన లబ్ధిదారులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు చేయడం జరిగింది. వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులను తో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినది. గద్వాల నియోజకవర్గంలో మొదటి విడత లో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగినది.

## గట్టు మండలం ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే గారు

దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్న. త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలి. ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి గారి తో సాధ్యమైనది అని పేర్కొన్నారు. ప్రజలు ఎవరు కూడా ఆందోళన అపోహాలు పడాల్సిన అవసరం లేదు ఇల్లు కట్టించుకుంటే డబ్బులు రావని అపోహాలు వద్దు ఇల్లు రానివారికి ఎవరు కూడా అపోహ పడవద్దండి. రెండో విడతలో త్వరలో కూడా అర్హులైన లబ్ధిదారులు కు మంజూరు ఏవిధంగా కృషి చేస్తామని తెలిపారు.ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం శ్రీ రేవంత్ రెడ్డి గారికి గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు శ్రీ పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి గారికి గద్వాల నియోజకవర్గ ప్రజలందరి తరపున ధన్యవాదాలు ..... ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ ... ఎన్నో ఏళ్ళు గా మా సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి సారథ్యంలో ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి మాకు చాలా సంతోషంగా ఉన్నది మేము ఎల్లప్పుడూ సీఎం



గారికి మంత్రి గారికి మా ఎమ్మెల్యే గారికి రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచులు అధ్యక్షులు రాజశేఖర్, సీనియర్ రామకృష్ణ రెడ్డి, సర్పంచ్ , నాయకులు హనుమంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సంతోష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లా విద్యలో ప్రతిభ చాటిన బానోతు దీపికకు అభినందనలు

### రాష్ట్రీయ గోర్ సేన నాయకుడు బానోత్ సురేష్ నాయక్ చెల్లి బానోతు దీపిక అడ్వకేట్‌గా ఉన్నత స్థాయికి ఎదగడం అభినందనీయం



మహబూబాబాద్: ఆగస్టు 14 (సమయం ప్రతినిధి): మహ బూబాబాద్ జిల్లా గూడూరు మండలం అక్కృతండ, అప్పరాజుపల్లి గ్రామానికి చెందిన బానోతు విమల-శంకర్ నాయక్, దంపతుల ఏకైక కుమార్తె బానోతు దీపిక న్యాయ విద్యను విజయవంతంగా పూర్తి చేసి ప్రొఫెషనల్ అడ్వకేట్‌గా ఎదిగారు.ఎన్నో కష్టాలను ఎదు ర్కొంటూ పట్టుదలతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకున్న దీపిక ను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు అభినందించారు. ముఖ్యంగా ఆమె సోదరుడు రాష్ట్రీయ గోర్ సేన నాయకుడు బానోత్ సురేష్ నాయక్, తన చెల్లి సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.గతంలో రాష్ట్రీయ గోర్ సేన హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ గా కూడా పనిచేయడం జరిగిందని గర్వంగా చెప్పారు. దీపిక తండ్రి శంకర్ నాయక్ కుటుంబ పోషణ కోసం హైదరాబాద్‌లో పాసి పనులు చేస్తూ జీవనం సాగిస్తూ, తన కుమార్తెను ఉన్నత చదువులు చదివించాలని ఎంతో కష్టపడ్డారని కుటుంబ సభ్యులు తెలిపారు. తల్లిదండ్రుల కష్టానికి తోడు దీపిక పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసంతో న్యాయ విద్యను పూర్తి చేసి అడ్వకేట్‌గా తన లక్ష్యాన్ని సాధించడం కుటుంబానికి ఎంతో గర్వకారణంగా మారింది. "కష్టపడి చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చనే దానికి దీపిక విజయం ఒక మంచి ఉదాహరణ. భవిష్యత్తులో న్యాయ రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, పేదలు సామాన్య ప్రజలకు న్యాయ సహాయం అందించాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు." దీపిక విజయంతో అక్కృతండ, అప్పరాజుపల్లి ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

## తిరంగమయంగా అమరచింత




అమరచింత : బీజేపీ అమరచింత పట్టణ కమిటీ పిలుపు మేరకు, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి పిలుపునందుకుని హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా అమరచింత పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ కట్టా దగ్గర నుంచి యూనియన్ బ్యాంక్ వరకు, అక్కడి నుంచి తిరిగి రాజీవ్ గాంధీ కూడలి వరకు సాగిన ఈ తిరంగ ర్యాలీలో జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలతో అమరచింత పట్టణాన్ని తిరంగమయం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ కమిటీ నాయకులు, బీజేపీ కౌన్సిలర్లు, చేనేత సహకార సంఘం కమిటీ సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తిరంగ ర్యాలీని విజయవంతం చేశారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, కులమతాలకు అతీతంగా భారతీయులంతా ఐక్యంగా ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. భారతదేశ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ దేశ ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేయడంలో యువత కీలక పాత్ర పోషించాలని, దేశ భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

సమయం ప్రతినిధి: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు వస్తున్నా యని ఉద్యానశాఖ అధికారి స్వాతి అన్నారు. శుక్రవారం చొప్పదండిలో ఆయిల్‌పామ్ పంట కోతను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యానశాఖ ద్వారా 2023 జనవరిలో నాటిన ఆయిల్‌పామ్ మొక్కల నుంచి ప్రస్తుతం గెల కోత ప్రారంభమైందని, చొప్పదండికి చెందిన రైతు సోమ మల్లారెడ్డి ఎనమిది ఎకరాల తోట నుంచి ఇప్పటివరకు మూడు కోతల్లోనే 8 టన్నుల దిగుబడి వచ్చిందని తెలిపారు. లక్షా 94 వేల రూపాయల ఆదాయం వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ టన్ను ధర 23,488గా ఉందని తెలిపారు. రైతులు సాగుకు ముందుకు రావాలని ఆమె కోరారు.

## 'మిల్లెట్ భారత్'.. విద్యార్థుల సృజనాత్మకతకు అద్దం




జడ్చర్ల , ఆగస్టు 14, సమయం ప్రతినిధి: భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక డా. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జడ్చర్లలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లో వినూత్నంగా 'మిల్లెట్ భారత్' చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల లో ఈ సంవత్సరం కొత్తగా ఏర్పాటు చేసిన ఏఈడీపీ కోర్సు అయిన హార్టికల్చర్ విభాగం విద్యార్థులు వివిధ రకాల చిరుధాన్యాలను ఉపయోగించి భారతదేశ పటాన్ని ఆకర్షణీయంగా రూపొందించారు. చిరుధాన్యాల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేయడంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహారం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిర వ్యవసాయం పట్ల అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలంగాణ బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డా. బి. సదాశివయ్య తెలిపారు. నెల రోజులుగా హార్టికల్చర్ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు ఎంతో ఆసక్తి, అంకితభావంతో పనిచేసి పచ్చదనంతో కళకళలాడే 'మిల్లెట్ భారత్'ను రూపొందించారని చెప్పారు. 'సస్యశ్యామల భారతదేశం – ఆరోగ్యకరమైన భారతదేశం' అనే సందేశాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లడమే 'మిల్లెట్ భారత్' ప్రధాన ఉద్దేశమని ఆయన అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ 'మిల్లెట్ భారత్' విద్యార్థులు, కళాశాల సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో హార్టికల్చర్ విద్యార్థులు, పరిశోధక విద్యార్థుల కృషి అమోఘమని డా. సదాశివయ్య అభినందించారు. ఇలాంటి విన్నూత కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి సుకన్య సిబ్బంది అభినందించారు.

## ఈ 'అబద్ధాల ప్రవాహం' ఇంకెన్నాళ్లు?

సమయం ప్రతినిధి: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య (12.08.2026న) 'వరి వృద్ధికి కారణం కాళేశ్వరం కాదు' అనే శీర్షికన రాసిన ఒక వ్యాసాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రీట్వీట్ చేస్తూ.. కాళేశ్వరం లేకుండానే రికార్డు పంట పండిందని, దానికి కారణం రైతు రుణమాఫీ, రైతు భరోసా, 24 గంటల ఉచిత కరెంటు, పెరిగిన నీటి లభ్యతే కారణమని మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నం చేశారు.



వాస్తవం ఏమిటంటే.. 2014కు ముందున్న వ్యవసాయ సంక్షోభాన్ని అధిగమించడానికి కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయం, విద్యుత్, సాగునీటి రంగాలపై వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టి, ఆయా రంగాలలో మౌలిక సదుపాయాలను కల్పించింది. రైతులను ఆదుకునేందుకు పలు రైతు సంక్షేమ పథకాలను అమలు చేసింది.

రాష్ట్రంలో బోరు బావుల కింద వ్యవసాయం పెరగడానికి ప్రాథమికమైన అవసరాలు రెండు. 1. నాణ్యమైన కరెంటు సరఫరా, 2. భూగర్భ జలాల లభ్యత. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలుపరచిన మొదటి flagship ప్రోగ్రాం- మిషన్ కాకతీయ. ఉమ్మడి రాష్ట్రంలో ధ్వంసం అయిపోయిన చెరువుల పునరుద్ధరణ కోసం సర్కారు ఈ పథకాన్ని చేపట్టింది. దీని ద్వారా నాలుగు దశల్లో రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో 28 వేల చెరువులను, కుంటలను పునరుద్ధరించింది.

రెండో దశలో ఈ చెరువులన్నింటినీ మేజర్, మీడియం ప్రాజెక్టులతో అనుసంధానించాలని సంకల్పించింది. దీని కోసం కాలువల మీద సుమారు 3 వేల కొత్త తూములను నిర్మించింది. ఈ ప్రోగ్రాం ద్వారా మేజర్, మీడియం ప్రాజెక్టుల కింద సుమారు 20 వేల చెరువులు అనుసంధానం అయ్యాయి. ఎండాకాలంలో కూడా చెరువులు నిండుగా మత్తడి దుంకిన దృశ్యాలను రాష్ట్ర ప్రజలు చూసి ఉన్నారు.

మూడో దశలో వాగుల పునరుజ్జీవన పథకం కింద రాష్ట్రంలో ఉప నదులు, ప్రధాన వాగులపై 1500 చెక్ డ్యాంలను నిర్మించింది. ఈ చర్యలు రాష్ట్రంలో భూగర్భ జలాలు సగటున 5 మీటర్లు పైకి రావడానికి దోహదం చేశాయని భూగర్భ జలశాఖ తన అధ్యయనంలో నిర్ధారించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టుల్లో నిర్మించిన భారీ జలాశయాలు కూడా ఆ చుట్టుపక్కల పది కిలోమీటర్ల పరిధిలో భూగర్భ జలాల లభ్యతకు దోహదం చేశాయి.

'గోదావరి జలాలను ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా గట్టిగా ఎత్తిపోయండి' అని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు ముఖ్యమంత్రి. ఈ ప్రాజెక్టులను నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వం కాదా? ఎల్లంపల్లి, మిడ్ మానేరు జలాశయాలను జలయజ్ఞంలో ప్రారంభించి పూర్తి చేయకుండా వదిలేస్తే, వాటిలో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించి, పూర్తి చేసింది కేసీఆర్ ప్రభుత్వం కాదా? దేవాదులలో ప్రస్తుతం తొమ్మిది పంపులు నడుపుతున్నామని ప్రస్తుత పాలకులు గొప్పలకు పోతున్నారు. అందుకు కారణమైన దేవాదుల మూడో దశ పంపింగ్ వ్యవస్థను పూర్తి చేసింది కేసీఆర్ ప్రభుత్వం కాదా? సీతారామా ఎత్తిపోతల పథకానికి అన్ని అనుమతులు సాధించి ప్రాజెక్టు హెడ్‌వర్క్సును, పంపింగ్ వ్యవస్థలను కేసీఆర్ ప్రభుత్వం పూర్తి చేస్తేనే కదా ఈ రోజు నాగార్జునసాగర్ కాలువకు నీరు ఇవ్వగలుగుతున్నారు. ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోసేవి కాళేశ్వరం నీళ్లు కావని ఇంకా రేవంత్‌రెడ్డి, అతని తాబేదారులు మాట్లాడుతుంటే ఆశ్చర్యం కలుగుతున్నది. ఎల్లంపల్లి, మిడ్ మానేరు జలాశయాలు కాళేశ్వరం ప్రాజెక్టులో విడదీయలేని కాంపోనెంట్స్. ఎవరు కాదన్నా ఇదే నిజం. కేంద్ర జల సంఘం వారు ఆమోదించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఇరిగేషన్ ప్లానింగ్ అనుమతిలో ఎల్లంపల్లి వద్ద లభ్యమయ్యే 20 టీఎంసీల నీళ్లను కూడా లెక్కలోకి తీసుకున్న సంగతి వీరికి ఎవరు చెప్పాలి? ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు, అక్కడి నుంచి పైన ఉన్న అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, మల్కపేట, బస్వాపూర్ జలాశయాలకు నీరు పారుతున్నది కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన పంపింగ్ వ్యవస్థ నుంచి కాదా? కాళేశ్వరం Multi Sources కలిగి ఉన్న ప్రాజెక్టు అన్న సంగతి తెలియకపోవడం వీరి అజ్ఞానానికి సూచిక. శ్రీరాంసాగర్ రెండో దశ ఆయకట్టుకు సాగునీరు సరఫరా మొదలయ్యింది కాళేశ్వరం ప్రారంభం అయిన తర్వాతనే అన్నది అబద్ధమా? కాళేశ్వరం కట్టిన తర్వాతనే నిజాంసాగర్ మొత్తం ఆయకట్టు స్థిరీకరణ సాధ్యం అయ్యిందనేది అబద్ధమా? కాళేశ్వరంలో నిర్మించిన మూడు వరుస బ్యారేజీల వలన 150 కిలోమీటర్ల పొడవున గోదావరి నది సజీవం అయినది అబద్ధమా? ఆ సజీవ నది సాధించిన ప్రయోజనాలు వారి ఆలోచనలకు అందనివి. 'చరిత్రను ఎంత దాచిపెట్టినా దాగదు' అన్న విషయం మీరు గుర్తుపెట్టుకోవాలి. తెలంగాణ రైతాంగానికి అన్నీ తెలుసు. వారిని ఇక ఎంతమాత్రం ఇటువంటి వ్యాసాలతో, రీట్వీట్లతో మభ్యపుచ్చలేరు. హామీలు ఇచ్చి అమలు మరిచిన రుణమాఫీ బండారాన్ని, రైతు భరోసా మోసాన్ని, 24 గంటల కరెంటు సరఫరా బూటకాన్ని, రైతు బీమా అబద్ధాన్ని తెలంగాణా రైతాంగం అర్థం చేసుకున్నది. సరైన సమయంలో బుద్ధి చెప్పడానికి వారు సిద్ధంగా ఉన్నారు. చరిత్రను మరుగునపెట్టి అబద్ధాలను ప్రచారం చేయడం ఇకనైనా మానుకోవాలి. మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేసినట్లు... మన ఏడు ప్రాజెక్టులకు శరాఘాతం చేసేలా ఏపీ ప్రతిపాదించిన అంశాలను జీఆర్‌ఎంబీ ఎజెండా నుంచి రద్దు చేసేలా పోరాటం చేయండి. లేనిపక్షంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో జీఆర్‌ఎంబీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం. తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణ కోసం దండుగా కదులుతాం!





# యాచారం మండల కేంద్రంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**యాచారం, ఆగస్టు 14 (సమయం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లా యాచారం మండల కేంద్రంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు జరుపుల విజయ్ నాయక్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొప్పు భాష, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరిపెల్లి అంజయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 80 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ ఐక్యత, సమగ్రతను చాటాలని పిలుపునిచ్చారు. దేశభక్తి, జాతీయ భావాలను ప్రతి ఒక్కరిలో పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా సహకోశాధికారి తాండ్ర రవీందర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు నాగని యాదయ్య, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు గోగికర్ రమేష్, ఓబీసీ మోర్చా రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు అంబోజి జగదీష్, మొండి గౌరెల్లి సర్పంచ్ కొలను రమాదేవి మల్లారెడ్డి, చింతుల్ల సర్పంచ్ అంబోజి రమేష్, తాడిపర్తి సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్, యువమోర్చా అధికార ప్రతినిధి వనవాడ రవీందర్‌రెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు కొండాపురం నాగరాజు, కుంచారం సందీప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు పల్లపు నరేష్, కదారి జంగయ్య, బొడ్డు భాషయ్య, ఉపసర్పంచులు గౌర లక్ష్మణ్, గౌర నాగరాజు, రవీందర్, బీజేపీ నాయకులు నాయిని పాండురంగారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సంతోష్ గుప్తా, నారిమల రమేష్, పత్తి రాజు, సాటు మల్లేష్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు పెరుమాళ్ల విక్రమ్, పల్లపు రవీందర్, శ్రీకాంత్‌రెడ్డి, బన్నే శివ, బూర సందీప్, కానుగుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలతో దేశభక్తిని చాటుకున్నారు.

# జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఘనంగా తిరంగా ర్యాలీ

**గద్వాల, ఆగస్టు 14 (సమయం ప్రతినిధి ):** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంఏఎల్‌డీ కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్, కృష్ణవేణి చౌక్, రాజీవ్ మార్గ్ మీదుగా పాత బస్టాండ్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ ప్రజలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. హర్ ఘర్ తిరంగా పిలుపుతో దేశవ్యాప్తంగా ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఎగురవేస్తున్నారని అన్నారు. తిరంగా ర్యాలీల ద్వారా దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీని విజయవంతం చేసిన విద్యార్థులు, యువతకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్ లక్ష్యంతో పనిచేస్తున్నారని, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యువత ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీ డీకే అరుణ సూచించారు. దేశ సమగ్రత, ఐక్యత కోసం యువత కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు. శత్రు దేశాల కుట్రలను తిప్పికొట్టేందుకు దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రరెడ్డి, రాష్ట్ర మండలి సభ్యుడు బండల వెంకట రాములు, అక్కల రమాదేవి, జిల్లా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం సమన్వయకర్త మిర్జాపురం వెంకటేశ్వరరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు రవికుమార్ ఎక్బోటే, శ్యామ్‌రావు, కేకే రెడ్డి, జిల్లా కోశాధికారి మిర్జాపురం రామచంద్రరెడ్డి, గద్వాల పోటీ చేసిన అభ్యర్థి బలిగేరా శివారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు బండల వెంకట రాములు, కృష్ణవేణి, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ, కౌన్సిలర్లు బండల రామలక్ష్మి, మానస త్యాగరాజు, శాలన్న, చంద్రశేఖర్, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సమత గౌడ్, బీజేపీ నాయకులు, వైద్యులు, న్యాయవాదులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# అమెరికా రాజకీయాల్లో 'సోషలిస్ట్' హవా!

**(సమయం ప్రతినిధి ):** ఒకటిన్నర దశాబ్దం తర్వాత అమెరికా భారీ రాజకీయ కుదుపునకు లోను కాబోతున్నదా? చాపకింద నీరులాగా డెమోక్రాట్లలో తమ ప్రాబల్యం పెంచుకుంటున్న డెమోక్రటిక్ సోషలిస్టులు అమెరికా రాజకీయ విధాన స్వరూపాలను పునర్నిర్వచించే బలమైన రాజకీయ శక్తిగా ఆవిర్భవించనున్నారా? డెమోక్రాట్ల ప్రైమరీస్ ఎన్నికలలో నమోదవుతున్న కొన్ని విజయాలు ఈ ప్రశ్నలు రేపుతున్నాయి. ఈ ఎన్నికల్లో డెమోక్రటిక్ సోషలిస్టులు గెలుస్తున్నారు. వారి గళం కొత్త నినాదాలను లేవనెత్తుతున్నది. ఆ స్వరాల సంఖ్య ప్రస్తుతానికి పరిమితమే కానీ, తమ వాదనల ద్వారా వారు సంప్రదాయ డెమోక్రాట్లలో కూడా మద్దతును కూడగట్టుకుంటున్నారు. మిషిగన్‌లో ప్రైమరీస్ ఎన్నికలలో అబ్దుల్ ఎల్ సయీద్ విజయం ఇందుకు తాజా ఉదాహరణ. డెమోక్రాట్ సోషలిస్ట్ అయిన సయీద్ అయిదుసార్లు కాంగ్రెస్ ఉమన్‌గా ఉన్న హేలీ స్టీవెన్స్‌ను స్వల్ప మెజారిటీతో ఓడించారు. డిస్ట్రిక్ట్ ప్రైమరీస్‌లో ఠాణేదార్‌ను డెమోక్రాట్ సోషలిస్టు డొనావన్ మెకిన్నీ ఓడించారు. అలాగే తాజా విజయాలు నమోదు చేసిన రషీదా త్లయిబ్, క్రిస్ గ్లిమర్ హిల్‌లు కూడా డెమోక్రటిక్ సోషలిస్టులే. ఈ విజయాలన్నీ డెమోక్రాట్లలో సోషలిస్టుల ఆధిపత్యం పెరుగుతోందన్న వాదనకు కొనసాగింపు మాత్రమే. న్యూయార్క్ సిటీ మేయర్ జొహ్రాన్ మందానీ వీరిలో ప్రముఖుడు. డెమోక్రాట్ సోషలిస్టుల భావజాలంతో కూడిన ప్రకటనలతో తరచూ వార్తల్లో నిలుస్తున్న వ్యక్తి కూడా.

అమెరికాను మరింత సోషలిజం వైపు తీసుకెళ్లాలనే వాదన డెమోక్రాట్లలో పెరుగుతోంది. ప్రైవేట్ హెల్త్ కేర్ రంగాన్ని సమూలంగా తొలగించడం, పోలీసులకు నిధులను తగ్గించడం వంటివి వీరు ప్రధానంగా తెరమీదకు తెస్తున్నారు. సొంత ఇంటి కల కోసం తాకట్టులు పెట్టాల్సిన పరిస్థితి ఉండదనే ప్రజాకర్షక ప్రకటనలతో వీరు ముందుకు వస్తున్నారు. అంతేకాదు, సెనేట్, ప్రెసిడెన్సీ, సుప్రీంకోర్టు వ్యవస్థలలో కూడా భారీ మార్పులు రావాలని వీరు డిమాండ్ చేస్తున్నారు.

సాధారణంగా అమెరికాలో రాజకీయ నాయకుల మాటలు, ప్రకటనలు, వాగ్దానాలు రెండు రకాలు. ప్రజల్లోంచి ఎన్నికవడానికి పార్టీ అభ్యర్థిగా



వచ్చినప్పుడు ఒకరకమైన వాగ్దానాలు ఉంటాయి. పార్టీ అభ్యర్థిగా ఎంపికవడానికి ప్రైమరీస్ ఎన్నికల్లో పోటీచేసినప్పుడు ఆ మాటలు మరో రకంగా ఉంటాయి. సాధారణ ఎన్నికలంటే అన్ని వర్గాల, భిన్న ఆలోచనా ధోరణులకు చెందిన ప్రజల ఓట్లను రాబట్టేలా మాటలు ఉండాలి. కానీ ప్రైమరీస్ అలా కాదు. ప్రైమరీస్ ఎన్నికల్లో తమ పార్టీ కార్యకర్తలను ఆకట్టుకోవడమే ప్రధానం. పార్టీలో ఇంచుమించుగా తమ భావజాలానికి చెందినవారే కార్యకర్తలుగా ఉంటారు. కాబట్టి సారూప్యత ఉన్న తమ భావజాలంలోనే, కొన్ని అతివాద ధోరణులను ప్రదర్శించడం ద్వారా వారిని ఆకట్టుకోవాలి. డెమోక్రాట్ సోషలిస్టులు చేస్తున్నది అదే. 'మరింత సోషలిజం-- మరింత సమానత్వం' దిశగా తమ ఎజెండాను ప్రొజెక్ట్ చేస్తూ డెమోక్రాట్ పార్టీ ప్రైమరీస్‌లో వీరు నెగ్గుతున్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో సమూల మార్పులు తేవడం, పని అవసరం తక్కువ చేయడం, జరిమానాలు, అప్పులు, తాకట్టులు లేని సమాజం, అందరికీ సమానమైన-- ప్రభుత్వపరమైన ఆరోగ్యభద్రత లాంటివి వీరి ఎజెండా అంశాలు. డెమోక్రాటిక్ సోషలిస్టులు వ్యాప్తిచేస్తున్న భావజాలంలో, యుద్ధాలు లేని సమాజం, జాతి లింగ వివక్షలను రూపుమాపడం వంటివీ ఉన్నాయి. ఇరాన్, క్యూబా, వెనెజువెలా వంటి దేశాలతో ఆంక్షలు లేని, నియంత్రణలు లేని సంబంధ బాంధవ్యాలు కావాలనే డిమాండ్ కూడా ఉంది. ఈ పరిణామాలను విశ్లేషకులు బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న రోజుల్లో రిపబ్లికన్ పార్టీలో మొదలైన టీపార్టీ ఉద్యమంతో పోలుస్తున్నారు. అప్పట్లో ఒబామా పాలన నాటి హెల్త్ కేర్ సంస్కరణలు, ప్రభుత్వ వ్యయాలు, పన్నుల విధానాలను కొందరు కన్జర్వేటివ్ నాయకులు వ్యతిరేకించారు. వారు నిరసనలతో ఆగలేదు. తమ బలమైన వ్యతిరేకతతో ఏకీభవించే వారినే రిపబ్లికన్ ప్రైమరీస్‌లో పోటీచేయించారు. ఆ పార్టీలో అప్పటికే గుర్తింపు పొందిన అభ్యర్థి కంటే, మరింత కన్జర్వేటివ్ ఆలోచనలున్న అభ్యర్థులకే ఈ టీపార్టీ ఉద్యమకారుల అండ లభించింది. 'డెమోక్రాట్లను ఓడించడం మాత్రమే కాదు, రిపబ్లికన్ పార్టీ గమనాన్ని కూడా మరింత కన్జర్వేటివ్‌గా పునర్నిర్దేశిస్తాం' అన్నట్టుగా వారి ధోరణి సాగింది. వీరు 63 సీట్లు గెలిచి రిపబ్లికన్ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ నియంత్రణ మొత్తాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. సెనేట్‌లో 6 సీట్లు గెలిచినా మెజారిటీ దక్కలేదు. అప్పటివరకు ఉదారవాద-- కన్జర్వేటివ్ భావజాలాల మిశ్రమంగా ఉన్న రిపబ్లికన్ పార్టీ ఎక్కువ కన్జర్వేటివ్‌గా మారింది. టీపార్టీ ఉద్యమం ద్వారా బలపడిన కన్జర్వేటివ్ వాదులు రిపబ్లికన్ పార్టీలో క్రమంగా ఆధిపత్యం సాధించిన తీరు, ఇప్పటి డెమోక్రటిక్ పార్టీలో సోషలిస్టుల ప్రాబల్యం పెరుగుతుండడానికి దగ్గరగా ఉంది. ఈ క్రమంలో డెమోక్రటిక్ పార్టీ అతివాద సోషలిస్టుల చేతిలోకి పూర్తిగా వెళ్లిపోతే గనుక, అమెరికా భవిష్యత్ రాజకీయ విధానాల్లోనే భారీ కుదుపు వచ్చినా ఆశ్చర్యం లేదు. ఈ సోషలిస్టు ఎజెండాను అమెరికా పౌరసమాజం ఎలా స్వీకరిస్తుందో చూడాలి.

# కనిపించని శాంతి

**(సమయం ప్రతినిధి):** హమాస్ తన జేబులో ఉన్న ఆ చిట్టచివరి తుపాకీని కూడా ఆవల విసిరేసి, సంపూర్ణ ఆయుధవిసర్జనకు సిద్ధపడిందనే అనుకుందాం, అప్పుడు బెంజమీన్ నెతన్యాహూ తన సర్వసైన్యాలనూ గాజానుంచి వెనక్కు తోలుకుపోతారా? ఈ ప్రశ్నకు సమాధానం తెలిసిందే కనుక, అమెరికా అధ్యక్షుడు ఎంతో ఆర్భాటంగా ఇటీవల ప్రకటించిన ఆ 'చారిత్రాత్మక ఒప్పందా'న్ని ఇజ్రాయెల్ ప్రధాని తిరస్కరించడం ఆశ్చర్యం కలిగించదు. వాళ్ళేదో అంటూంటారు, మాకు కొన్ని గిట్టవు అంటూ అత్యంత తేలికగా ఇజ్రాయెల్ ప్రధాని వ్యాఖ్యానించారు. ఆయుధాలు వదిలి, వాటిని అప్పగించడానికి హమాస్ అంగీకరించిందనీ, గాజా నుంచి ఇజ్రాయెల్ బలగాల ఉపసంహరణపై అంగీకారం కుదిరిందని ట్రంప్ సగర్వంగా ప్రకటించిన వారంలోనే, నెతన్యాహూ ఎంతో మార్యాదకరమైన భాషలో దానిని కొట్టిపారేశారు. మరిన్ని రక్తపుటేరులు పారించడం వినా, చొరబడిన గాజా నుంచి నెతన్యాహూ కాలువెనక్కుతీసుకోవడం జరిగేపని కాదనడానికి ఇజ్రాయెల్ చరిత్రే సాక్ష్యం. మీరూ వచ్చి చేరండి, శాంతికోసం చేతులు కలపండి అంటూ అమెరికా అధ్యక్షుడు అనేక దేశాలమీదా ఒత్తిడితెచ్చి, ఏర్పాటు చేసిన 'బోర్డ్ ఆఫ్ పీస్' పట్ల నెతన్యాహూ వైఖరి అది. నలభైదేశాలు ఆర్నెల్లుగా అన్నిపక్షాలతో చర్చోపచర్చలు జరిపి, ట్రంప్ పరిభాషలో చెప్పుకోవాలంటే, ఒక చారిత్రాత్మకమైన అవగాహన కుదర్చిన వారంలోనే నెతన్యాహూ దానిని కాదు పొమ్మన్నారు. అమెరికా మధ్యవర్తిత్వంతో దాదాపు ఏడాదిక్రితం కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ ఏ మాత్రం విలువ ఇచ్చిందో చూశాం. దాడులు కొనసాగిస్తూ సుమారు పదిహేనువందలమందిని అది ఈ కాలంలోనే పొట్టనబెట్టుకొంది. మూడింట రెండువంతుల గాజా భూభాగంలో నెతన్యాహూ సైన్యం తిష్టవేసుకొని కూర్చుంది. స్కూళ్ళు, ఆస్పత్రులు నేలమట్టమై కనీస వైద్యచికిత్సలు కూడా అందని స్థితిలో, ఇళ్ళులేని లక్షలాదిమంది అక్కడ టెంట్లలోనే కాలం గడుపుతున్నారు. వారికి ఆహారం సైతం సక్రమంగా అందనివ్వకుండా చేస్తున్న ఇజ్రాయెల్, పరిస్థితులను కనీసంగా మెరుగుపరచడానికి కూడా సహకరించడం లేదు.







# అంతర్ రాష్ట్ర బైక్ దొంగల ముఠా గుట్టురట్టు జిల్లా ఎస్పీ

**18 బైకుల చోరీ కేసును ఛేదించిన పెబ్బేరు పోలీసులు నలుగురు అరెస్ట్**
**జల్సాల కోసం బైక్ చోరీలను వృత్తిగా మార్చుకున్న అన్నదమ్ములు**
**పాత బైకులు, తాళాలు సరిగా లేని వాహనాలే టార్గెట్ - తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో వరుస చోరీలు**
**హత్య, దొంగతనాలు, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పీడీ యాక్ట్ నిందితుడి నేర చరిత్ర**
**రూ.12.50 లక్షల విలువైన 18 బైకుల చోరీ కేసు ఛేదన**





(సమయం ప్రతినిధి వనపర్తి): జల్సాల కోసం బైక్ దొంగతనాలను వృత్తిగా మార్చుకొని, తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వరుసగా బైకులు చోరీ చేస్తూ వాటిని రాష్ట్రం దాటించి విక్రయిస్తున్న అంతర్ రాష్ట్ర బైక్ దొంగల ముఠాను పెబ్బేరు పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి చోరీకి సంబంధించిన కీలక వివరాలను పోలీసులు రాబట్టారు. వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి సునీతా రెడ్డి, ఐపీఎస్., శుక్రవారం సాయంత్రం పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. చెలిమిల్ల గ్రామానికి చెందిన కుర్వ శ్రీరాములు తన బైక్ చోరీకి గురైనట్లు పెబ్బేరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో రంగాపూర్ గ్రామ శివారులోని గుర్రంగడ్డ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, పోలీసులను గమనించిన నిందితుడు అమీర్ హంజా పఠాన్ బైక్‌ను అక్కడే వదిలి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా పొంతనలేని సమాధానాలు చెప్పడంతో లోతుగా విచారించారు. దీంతో తన సోదరుడు పఠాన్ నబీఖాన్‌తో కలిసి బైకులు చోరీ చేస్తున్నట్లు నేరాన్ని అంగీకరించాడు. నిందితులు ప్రధానంగా పాత బైకులు, తాళం సెట్‌లు పాడైపోయిన వాహనాలు, సైడ్ లాక్ వేయకుండా పార్కింగ్ చేసిన బైకులు, తాళాలు పెట్టి నిర్లక్ష్యంగా వదిలేసిన వాహనాలను టార్గెట్ చేసేవారు. గత రెండు నెలల్లో తెలంగాణలో 8, ఆంధ్రప్రదేశ్‌లో 10, మొత్తం 18 బైకులను చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. చోరీ చేసిన బైకులను ఆత్మకూరుకు తరలించి విక్రయించేందుకు లింగాపురం గ్రామానికి చెందిన రమేష్, వెంకటరమణలతో ఒప్పందం చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బైకులను తాము చోరీ చేసి తీసుకువస్తామని, వాటిని విక్రయిస్తే ఒక్కో బైక్‌కు కమిషన్ ఇస్తామని నిందితులు వారితో డీల్ కుదుర్చుకున్నట్లు తేలింది. పెబ్బేరు, కొత్తకోట, గద్వాల, మానోపాడు, శాంతినగర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, దోర్నాల, పాణ్యం, ఎర్రగొండపాలెం, మార్కాపురం తదితర ప్రాంతాల్లో బైకులను చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైంది. చోరీ చేసిన 18 బైకుల మొత్తం విలువ సుమారు రూ. 12.50 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. నిందితుల నేర చరిత్రపై ఎస్పీ వెల్లడి ప్రధాన నిందితుడు అమీర్ హంజా పఠాన్‌పై గతంలో ఒక కేసు ఉండగా, అతని సోదరుడు పఠాన్ నబీఖాన్‌పై హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, దొంగతనం, పీడీ యాక్ట్ తదితర తీవ్రమైన కేసులు కలిపి 14 కేసులు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. నబీఖాన్ ఇప్పటికే 13 సార్లు జైలుకు వెళ్లి వచ్చినట్లు వెల్లడించారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

**నిందితుల వివరాలు**

1. అమీర్ అమ్జా పఠాన్ ఏ అమీర్ ఖాన్, ఇందిరానగర్, ఆత్మకూరు పట్టణం, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2. పఠాన్ నబీ ఖాన్, గరీబ్‌నగర్, ఆత్మకూరు పట్టణం, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3. పాతకోట రమేష్, జి. లింగాపురం గ్రామం, బండి ఆత్మకూరు మండలం, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్.
4. వల్లేపు వెంకటరమణ, లింగాపురం గ్రామం, బండి ఆత్మకూరు మండలం, నంద్యాల జిల్లా, ఆంధ్రప్రదేశ్.

ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ.. ప్రజలు తమ వాహనాల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. బైక్‌ను పార్కింగ్ చేసే సమయంలో తప్పనిసరిగా హ్యాండిల్ లాక్, సైడ్ లాక్ వేసి, సాధ్యమైనంత వరకు సురక్షిత ప్రదేశంలో పార్కింగ్ చేయాలి. తాళాలు పెట్టి వాహనాలను నిర్లక్ష్యంగా వదిలివేయడం వల్ల దొంగలకు అవకాశం కలుగుతుంది. పాత బైకులు, తాళాలు సరిగా పనిచేయని వాహనాలు కూడా దొంగల టార్గెట్‌గా మారే అవకాశం ఉంది. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ప్రజల భద్రతకు భంగం కలిగించే నేరాలకు పాల్పడే వారిపై వనపర్తి జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారు. అంతర్ రాష్ట్ర స్థాయిలో నేరాలకు పాల్పడుతున్నా నిందితులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం." అని ఎస్పీ స్పష్టం చేశారు. కేసును ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన వనపర్తి డీఎస్పీ గిరిబాబు, కొత్తకోట సీఐ రాంబాబు, పెబ్బేరు ఎస్సై వెంకటేష్ గౌడ్లను ఎస్పీ అభినందించారు. అదేవిధంగా నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్ రెడ్డి, కానిస్టేబుళ్లు నరసింహ, విజయ్, రైటర్ ఆంజనేయులులను నగదు బహుమతితో అభినందించారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట సీఐ, రాంబాబు, పెబ్బేరు ఎస్సై, వెంకటేష్ గౌడ్, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పట్టణ అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి: ఎమ్మెల్యే బాలు నాయక్




**మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్‌పై సమీక్ష**

దేవరకొండ: ఆగస్టు 14 (సమయం ప్రతినిధి) : దేవరకొండ మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ .హాజరై పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై అధికారులు, మున్సిపల్ సభ్యులతో సమీక్షించారు. సమావేశంలో ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, విద్యుత్ లైన్లు, పారిశుధ్య నిర్వహణ, డంపింగ్ యార్డు, ఎస్‌టీపీ , వెట్‌వెల్స్, మున్సిపల్ పార్కుల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అవసరమైన రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చేపట్టడంతో పాటు డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని సమావేశంలో చర్చించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు నిరంతర విద్యుత్, వీధి దీపాల సౌకర్యం కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే 1.50 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఎస్‌టీపీ, వెట్‌వెల్‌లకు సంబంధించిన పనులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, డంపింగ్ యార్డు అభివృద్ధి తదితర అంశాలను కూడా సమావేశంలో సమీక్షించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు పారిశుధ్య కార్యక్రమాలను మరింత పటిష్టంగా నిర్వహించాలని చర్చించారు. పట్టణంలో జంతు జనన నియంత్రణ కేంద్రం ( ఏర్పాటుకు సంబంధించిన అంశంతో పాటు వీధి కుక్కల నియంత్రణ, జంతు సంక్షేమ చర్యలపైనా సమావేశంలో చర్చ జరిగింది. పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. మాట్లాడుతూ.. "దేవరకొండ పట్టణ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నాం. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి ప్రాథమిక సౌకర్యాల విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలి" అని అన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి. నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. దేవరకొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నాం. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలి అని ఎమ్మెల్యే బాలు నాయక్. పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశంలో మున్సిపల్ కమిషనర్, అధికారులు, ఛైర్పర్సన్ పున్న శైలజ-వెంకటేశ్వర్లు, మహ్మద్ జూవేరియా జువేరియా తబస్సుం-సమీర్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పాల్గొని పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

# గట్టులో అక్రమ నిర్మాణాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వార్డు సభ్యులు, ఉపసర్పంచ్



సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా గట్టు గ్రామ పంచాయతీ పరిధిలోని చింతలకుంట రోడ్డులో ఉన్న విలువైన గ్రామకంఠం (ప్రభుత్వ) స్థలాన్ని ఆక్రమించి అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ అంజనమ్మ అంజనేయులు,మరియు వార్డు సభ్యులు మాట్లాడుతూ... గ్రామానికి చెందిన ఉప్పరి దొడ్డెప్ప కుమారులైన ఉప్పరి సత్యనారాయణ, యుగంధర్, గోవిందప్ప, కృష్ణమూర్తి అనే నలుగురు సోదరులు సుమారు 70 ౪ 80 ఫీట్ల గ్రామకంఠ స్థలాన్ని ఆక్రమించుకున్నారని తెలిపారు. ఎలాంటి చట్టబద్ధమైన హక్కు పత్రాలు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లేకపోయినా, గతంలో సృష్టించిన నకిలీ కాగితాలను చూపుతూ అక్రమంగా షాపులు నిర్మించారని ఆరోపించారు. ?గ్రామంలో ఇతరులు ఎవరైనా ఇండ్లు నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తే వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ, అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, అధికారులను కూడా తప్పుదోవ పట్టిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఆ స్థలానికి సంబంధించిన హక్కుల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, గ్రామకంఠం స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. ?ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంజనమ్మ ఆంజినేయులు వార్డు సభ్యులు ం. రేవతి వెంకటేష్ , రోల్లి రేనమ్మా ,కంగారు తిమ్మప్ప రంగస్వామి, జక్కలి మునిస్వామి సోంపురం తిమ్మప్ప సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు: ఎమ్మెల్యే బాలు నాయక్



దేవరకొండ: చందంపేట: ఆగస్టు 14 (సమయం ప్రతినిధి) : పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన నూతన గృహాల్లోకి లబ్ధిదారులు అడుగుపెడుతున్నారు. ఈ క్రమంలో చందంపేట మండల కేంద్రానికి చెందిన ఇరుగదిండ్ల శ్రీశైలం-శ్వేత దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ . పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్. నూతన గృహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడారు. కొత్త ఇంటిలో వారు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే బాలు నాయక్ . మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు సొంత ఇల్లు ఒక కల కాదు.. అది వారి హక్కు అనే ఆలోచనతో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. సొంతింటి కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది అని అన్నారు. ఇందిరమ్మ ఇల్లు అంటే కేవలం నాలుగు గోడలు కాదు.. ఒక కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుకు భరోసా. ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా కృషి చేస్తున్నాం. దేవరకొండ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా జరిగేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తోందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతు సంక్షేమం, మహిళా సంక్షేమం, యువతకు అవకాశాలు, పేదలకు సంక్షేమ పథకాలు వంటి కార్యక్రమాలతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేరే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలిఅని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో చందంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి బధ్యా నాయక్, స్థానిక సర్పంచ్ సాధిక్, యువజన కాంగ్రెస్కి నియోజకవర్గ కిన్నెర హరికృష్ణ, గోసుల అనంతగిరి, జక్కుల మున్నయ్య యాదవ్, శంకర్ రావు, రామకృష్ణ, కరీం, వరికుప్పల కొండల్, ఎలుక జాలాంధర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.




వైవిధ్యమైన పాత్రలతో అలరిస్తున్న కామెడీ కింగ్ అల్లరి నరేష్ మళ్లీ తనదైన మార్క్ అవుట్ అండ్ అవుట్ కామెడీ జోనర్‌లోకి రీ-ఎంట్రీ ఇస్తున్నాడు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా ఫాంటసీ ఎంటర్‌టైనర్ రంభ ఊర్వశి మేనక. చంద్రమోహన్ చింతడ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో అల్లరి నరేష సరసన సురభి నటించింది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్రం ఆఫీషియల్ టీజర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. టీజర్ ఆద్యంతం నవ్వులు పూయిస్తుంది. ఈ సినిమా కథ అంతా ఒక విచిత్రమైన, సరదా ఫాంటసీ కాన్సెప్ట్‌తో సాగుతుంది. నరేష్ .. తన కొడుకుకు ఒక మ్యాజిక్ బుక్ చూపించి.. దానిపై ఉన్న ముగ్గును సరైన పద్దతిలో వేస్తే స్వర్గం నుంచి రంభ, ఊర్వశి, మేనకలు భూమిపైకి దిగుతారని చెప్తూ పెంచుతాడు. దీంతో అల్లరి నరేష్ అదే నిజమని నమ్మి.. పెద్ద స్టార్ కావాలనే కోరికతో 15 ఏళ్లుగా రంభ, ఊర్వశి, మేనకలకు పూజలు చేస్తూ ఆ ముగ్గు వేస్తూ ఉంటాడు. ఇక అలా ముగ్గు వేయడం వలన పైన ఇంద్ర లోకంలో ఉన్న ఇంద్రుడు ఆగ్రహానికి గురవుతూ ఉంటాడు. అనుకోకుండా ఇంద్రుడుకి కూడా చెప్పకుండా రంభ, ఊర్వశి, మేనక భూలోకంకు వచ్చేస్తారు. అసలు వారెందుకు భూమి మీదకు వచ్చారు. వారు రావడం వలన అల్లరి నరేష్ ఎదుర్కొన్న సమస్యలు ఏంటి.. ? చివరికి ఆ బుక్ మీద ఉన్న ముగ్గును సరిగ్గా వేశాడా.. ? ఇంద్రుడు కోపం వెనుక కారణమేంటి అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. టీజర్ చూశాక అల్లరి నరేష్ వింటేజ్ కామెడీ గుర్తురాకమానదు. ఇక సినిమాకు హైలైట్ అంటే రంభ, ఊర్వశి, మేనక పాత్రల్లో నటించిన అందగత్తెలే. సోషల్ మీడియాని తన అందంతో ఊపేసిన విష్ణుప్రియ, టాలీవుడ్ ని అందంతో పిచ్చెక్కించిన రాశీ సింగ్.. ఈ సినిమాలో దేవతలుగా దర్శనమిచ్చారు. నిజంగానే రంభ, ఊర్వశి, మేనక ఇంతే అందంగా ఉంటారా అనిపించేలా కనిపించారు.చేతన్ భగత్ మ్యూజిక్ అదిరిపోయింది. క్యూట్ అండ్ కాస్మిక్ కామెడీ ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్ సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలయ్యేందుకు సిద్ధమవుతోంది. అల్లరి నరేష్ పాత రోజుల్లోని టైమింగ్‌ను గుర్తుచేసేలా ఈ సినిమా ఉండబోతోందని టీజర్ చూస్తే స్పష్టమవుతోంది. మరి ఈ సినిమాతో అల్లరి నరేష్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.




ఇండస్ట్రీ ఒక మాయా ప్రపంచం. ఇక్కడ ఎప్పుడు ఏది జరుగుతుందో ఎవరు ఊహించలేరు. అంతేనా ఇండస్ట్రీలో ఎవరెవరు ఎప్పుడు ప్రేమలో పడతారు.. ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు.. ఎందుకు విడిపోతారు అని చెప్పడం కూడా చాలా కష్టం. ఒక హీరో హీరోయిన్ కలిసి బయట కనిపిస్తే వారి మధ్య ఏదో ఉందని పుకార్లు పుట్టుకొస్తాయి. తాజాగా రాజు వెడ్స్ రాంబాయి మూవీతో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో అఖిల్ రాజ్, ప్రముఖ ఫోక్ సింగర్ అండ్ డాన్సర్ నాగా దుర్గ కలిసి కనిపించడం ప్రస్తుతం నెట్టింట తీవ్ర చర్చనీయాంశమవుతోంది. వీరిద్దరి మధ్య ఏదో నడుస్తోందని పుకార్లు షికార్లు చేస్తున్నాయి. సిద్దిపేట జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి ఆలయంలో అఖిల్ రాజ్- నాగదుర్గ ప్రత్యక్షమయ్యారు. కోయిల్ ఆవరణలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సమయంలో తీసిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే వీరిద్దరూ కలిసి గుడికి రావడం వెనుక ఉన్న అసలు కారణం ఏంటనే దానిపై పలు ప్రచారాలు సాగుతున్నాయి. తెలంగాణ నేటివిటీతో రాబోతున్న ఒక క్రేజీ ప్రైవేట్ ఫోక్ సాంగ్ కోసమా లేదా నూతన ప్రాజెక్ట్ ప్రారంభానికి ముందు స్వామివారి ఆశీస్సులు తీసుకోవడానికి వచ్చారా అనే కోణంలో వార్తలు వస్తున్నాయి. కేవలం సాధారణ దర్శనం, ప్రత్యేక పూజల కోసమే కొమురవెల్లికి వెళ్లారు అంటే వీరిద్దరూ అంతకుముందు నుంచే ఫ్రెండ్స్ అయ్యి ఉంటారు అని కొందరు చెప్పుకొస్తున్నారు. ఇక ఆలయంలో ఈ జంటను చూసి స్థానిక భక్తులు, అభిమానులు ఫోటోలు దిగడానికి ఉత్సాహం చూపించారు. నాగదుర్గ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా మారింది. ఈమధ్యనే తమిళ్ లో లవ్ ఓ లవ్ సినిమాతో మెప్పించిన ఆమె తెలుగులో ఇడుపు కాయితం సినిమాతో ఎంట్రీ ఇవ్వనుంది. మరి వీరిద్దరి మధ్య ఏం జరుగుతుందో తెలియాలంటే కొన్నిరోజులు ఆగాల్సిందే.




దర్శకుడు శ్రీను వైట్ల. ఈ పేరు వినగానే టాలీవుడ్ ప్రేక్షకులకు గుర్తొచ్చేది నాన్‌స్టాప్ కామెడీ, అదిరిపోయే కమర్షియల్ ఎంటర్‌టైనర్లు. తెలుగు సినిమాలో కామెడీ టైమింగ్‌కి సరికొత్త నిర్వచనం చెప్పిన దర్శకుల్లో ఆయన స్థానం ప్రత్యేకం. వేగవంతమైన స్క్రీన్‌ప్లే, ఊహించని ట్విస్టులు, పొట్టచెక్కలయ్యే కామెడీ ట్రాక్స్‌తో బాక్సాఫీస్ వద్ద రికార్డుల మోత మోగించిన ఘనత ఆయన సొంతం. 'ఆనందం'తో మొదలైన ఆయన విజయ ప్రస్థానం.. 'వెంకీ', 'ఢీ', 'రెడీ', 'దూకుడు', 'బాద్‌షా' లాంటి సినిమాలతో సాగింది. ఒకప్పుడు ఆయన సినిమా వస్తోందంటే చాలు.. థియేటర్లలో నవ్వుల పండగే అని సినీ ప్రియులు ఫిక్స్ అయిపోయేవారు. ముఖ్యంగా స్టార్ హీరోలతో చేసిన సరికొత్త ప్రయోగాలు, బ్రహ్మానందం లాంటి హాస్య నటులకు రాసిన విలక్షణ పాత్రలు వెండితెరపై నవ్వుల పూలు పూయించాయి. తెలుగు కమర్షియల్ సినిమాకు ఒక సరికొత్త ఫార్ములాను సెట్ చేసిన ఘనత ఆయనది. దర్శకుడు శ్రీను వైట్ల (Srinu Vaitla).. ఈ పేరు వినగానే టాలీవుడ్ ప్రేక్షకులకు గుర్తొచ్చేది నాన్‌స్టాప్ కామెడీ, అదిరిపోయే కమర్షియల్ ఎంటర్‌టైనర్లు. తెలుగు సినిమాలో కామెడీ టైమింగ్‌కి సరికొత్త నిర్వచనం చెప్పిన దర్శకుల్లో ఆయన స్థానం ప్రత్యేకం. వేగవంతమైన స్క్రీన్‌ప్లే, ఊహించని ట్విస్టులు, పొట్టచెక్కలయ్యే కామెడీ ట్రాక్స్‌తో బాక్సాఫీస్ వద్ద రికార్డుల మోత మోగించిన ఘనత ఆయన సొంతం. 'ఆనందం'తో మొదలైన ఆయన విజయ ప్రస్థానం.. 'వెంకీ', 'ఢీ', 'రెడీ', 'దూకుడు', 'బాద్‌షా' లాంటి సినిమాలతో సాగింది. ఒకప్పుడు ఆయన సినిమా వస్తోందంటే చాలు.. థియేటర్లలో నవ్వుల పండగే అని సినీ ప్రియులు ఫిక్స్ అయిపోయేవారు. ముఖ్యంగా స్టార్ హీరోలతో చేసిన సరికొత్త ప్రయోగాలు, బ్రహ్మానందం లాంటి హాస్య నటులకు రాసిన విలక్షణ పాత్రలు వెండితెరపై నవ్వుల పూలు పూయించాయి. తెలుగు కమర్షియల్ సినిమాకు ఒక సరికొత్త ఫార్ములాను సెట్ చేసిన ఘనత ఆయనది. ఇటీవల కాలంలో వరుసగా విభిన్నమైన సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్న శర్వానంద్.. ఈ ప్రాజెక్ట్‌తో మరో సరికొత్త జోనర్‌లో మెప్పించేందుకు సిద్ధమవుతున్నారు. శర్వానంద్‌కు ఉన్న క్లాస్, మాస్ ఇమేజ్‌కి శ్రీను వైట్ల మార్క్ పక్కా కామెడీ, వన్‌లైనర్ పంచ్‌లు తోడైతే థియేటర్లలో వినోదం నెక్స్ట్ లెవల్‌లో ఉంటుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇప్పటికే 'నారీ నారీ నడుమ మురారి', 'బైకర్' వంటి చిత్రాలతో జోరుమీదున్న శర్వానంద్.. త్వరలోనే 'భోగి' సినిమాతో కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'జార్జ్ క్రిష్' చిత్రాన్ని వచ్చే సంక్రాంతి బరిలో నిలపాలని చిత్ర బృందం ప్రణాళికలు రచిస్తోంది. సినిమాలోని హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడికానున్నాయి.

Cinema




మెగాస్టార్ చిరంజీవికి తన సినిమాలకు సంబంధించిన సీక్రెట్స్ లేదా అప్‌డేట్స్‌ను వేదికలపై లీక్ చేయడం కొత్తేమీ కాదు. ఆయన హాజరయ్యే ప్రతి సినీ ఈవెంట్‌లోనూ లేదా ప్రెస్ మీట్‌లోనూ ఏదో ఒక సర్‌ప్రైజింగ్ లీక్ ఇవ్వడం ఆయనకు ఒక సరదా అలవాటుగా మారిపోయింది. గతంలో పలు సందర్భాల్లో తన సినిమాల టైటిళ్లను, కీలక సన్నివేశాలను అధికారిక ప్రకటనకు ముందే స్టేజ్ మీదే సరదాగా బయటపెట్టేసి చిత్ర యూనిట్‌ను, దర్శక నిర్మాతలను ఆశ్చర్యపరిచారు. ఇప్పుడు మరోసారి ఆ చిరు లీక్స్ ట్రెండ్ రిపీట్ అయింది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం కొరియన్ కనకరాజు. రితికా నాయక్ హీరోయిన్ గా తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 6 న రిలీజ్ అయ్యి భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా రికార్డ్ కలక్షన్స్ రాబట్టి వరుణ్ కెరీర్ లోనే బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. దీంతో చిత్రబృందం.. తాజాగా కొరియన్ కనకరాజు సక్సెస్ మీట్ ని ఏర్పాటు చేశారు. ఈ ఈవెంట్ కి మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇక ఈ వేడుకలో ఆయన చిరు లీక్స్ అందించారు. దర్శకుడు బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మెగా158 చిత్రానికి సంబంధించి టైటిల్, టీజర్ అప్‌డేట్‌ను చిరంజీవి మళ్లీ లీక్ చేసే ప్రయత్నం చేశారు. మెగా 158 సినిమా షూటింగ్ మొదలైనప్పుడు డైరెక్టర్ బాబీ, మ్యూజిక్ డైరెక్టర్ తమన్ తనను ఎంత వద్దు అని వారించినా వినకుండా, "పిచ్చోళ్లు.. వాళ్లు చెప్పొద్దంటే నేను ఆగిపోతానా? సరైన టైమ్ చూసి నేనే లీక్ చేస్తా" అంటూ ఒక వీడియో రిలీజ్ చేసిన విషయం తెల్సిందే. ఇక ఎట్టకేలకు కొరియన్ కనకరాజు సక్సెస్ మీట్ లో ఆయన మెగా 158 టైటిల్ కదిరి నరసింహుడు అని రివీల్ చేశారు. కదిరి అనగానే అక్కడ ఉన్నవారందరూ షాక్ అవ్వడంతో వెంటనే సీలేటన అయ్యారు. అంతేకాకుండా మెగాస్టార్ పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 22 న మెగా 158 టైటిల్ టీజర్ ని రిలీజ్ చేయనున్నట్లు కూడా తెలిపారు. దీంతో మెగా ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కదిరి అని హింట్ ఇవ్వడంతో కచ్చితంగా కదిరి నరసింహుడు అనే టైటిలే అయ్యి ఉంటుంది అని చెప్పుకొస్తున్నారు. మరి ఆ టైటిల్ తోనే టీజర్ వస్తుందా.. లేదా చూడాలి.




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ చాలా గ్యాప్ తర్వాత మరోసారి తన బాక్సాఫీస్ స్టామినా ఏంటో చూపిస్తున్నారు. ఆయన హీరోగా నటించి, హారర్ కామెడీగా తెరకెక్కిన 'కొరియన్ కనకరాజు' విడుదలైన మూడు రోజుల్లోనే అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ మార్క్‌ను దాటుకుని లాభాల బాటలోకి అడుగుపెట్టింది. ఈ సినిమాపై మేకర్స్ మొదటి నుంచి పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టింది. ప్రీమియర్స్ నుంచే పాజిటివ్ రెస్పాన్స్‌ను రాబట్టుకున్న ఈ చిత్రం.. ఆ తర్వాత దానిని కంటిన్యూ చేస్తూ మొదటి మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ మార్క్‌ను చేరుకోవడంతో.. మేకర్స్ యమా హ్యాపీగా ఉన్నారు. ప్రీమియర్స్ చూసిన ప్రేక్షకుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ సినిమాకు బిగ్ ప్రమోషన్‌గా మారడంతో.. రోజురోజుకూ 'కొరియన్ కనకరాజు'కి ఆదరణ పెరుగుతోంది. ముఖ్యంగా అమెరికాలో ఈ సినిమా హాఫ్ మిలియన్ డాలర్ల మార్క్‌కు చేరువలో ఉన్నట్లుగా మేకర్స్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. అలాగే, తొలి వీకెండ్‌లో ప్రపంచవ్యాప్తంగా రూ.37.4 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లుగా తెలుపుతూ, మేకర్స్ పోస్టర్ కూడా విడుదల చేశారు. ఈ సోమవారం తెలంగాణలో బోనాలు సెలవు కావడంతో సినిమాకు మరో అడ్వాంటేజ్ లభించినట్లైంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ కూడా అద్భుతంగా ఉండటంతో, ఈ హాలిడే రోజు కూడా కనకరాజు కుమ్మేసే అవకాశం లేకపోలేదు.


మీ ప్రత్యేకతను,
మీ వ్యాపార అభివృద్ధికి
కొందరు మాత్రమే
నమ్మకమైన సేవలందిస్తారు..



మీ శ్రేయస్సును ఆకాంక్షించే వారికి
ఆత్మీయతను పంచండి

మధురస్మృతులు
ద్వారా శుభాకాంక్షలు తెలియజేయండి మరింత దగ్గరవ్వండి. మీ కుటుంబం సభ్యులలో, మీ బంధుమిత్రులలో, మీ ఆఫీసులో సహోద్యోగి ఎవరైనా రిటైర్ అవుతున్నా, వైవాహిక జీవితం 60 వసంతాలు పూర్తి చేసి వసంతోత్సవం జరుపుకుంటున్నా, ప్రశంసలు అందుకున్న ఆయా సందర్భాల్లో వారి జీవిత విశేషాలు మధురస్మృతులు తో పంచుకోండి. పలువురికి ఆదర్శప్రాయులు కండి.



మా కార్యాలయము :-
మధురస్మృతులు
మాస పత్రిక
SREEJA SREE PUBLICATIONS
H.No: 1-3-129, Rajendra Nagar,
Mahabubnagar. PIN - 509001.
Ph : 9848997085, 08542-222814
e-Mail : ms.mbnr2@gmail.com


OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085